

## రేపటి నుంచి మైనార్టీలకు గ్రూప్-2 మాక్ టెస్టులు

కరీంనగర్ టౌన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఈ నెల 9, 10 తేదీల్లో ఉదయం 10:30 నుంచి సాయంత్రం 4:30 వరకు గ్రూప్-2 పరీక్షకు దరఖాస్తు చేసుకున్న మాక్ టెస్టులు నిర్వహిస్తున్నట్లు జిల్లా మైనార్టీ సంక్షేమాధికారి ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని మైనార్టీ బాలుర-1 గురుకులంలో ఈ పరీక్షలు నిర్వహిస్తామన్నారు. వివరాలకు కలెక్టరేట్‌లోని జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ అధికారి కార్యాలయంలో, 0878-2957085 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

## ఆటోల బంద్ విజయవంతం

భగత్‌నగర్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా శనివారం నిర్వహించిన ఆటో, టాటా ఏసీ, క్యాబ్ డ్రైవర్ల బంద్ విజయవంతమైంది. ఆటోలు నడవకపోవడంతో ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. ఈ సందర్భంగా కరీంనగర్ జిల్లా పబ్లిక్ ప్రైవేట్ రోడ్ ట్రాన్స్ పోర్టు వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు పున్నం రవి మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరుతూ జిల్లాలో బంద్ నిర్వహించామరు. రాష్ట్రంలో ఉన్న ఆటో రవాణా రంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తామని, ఫ్రీ బస్సు వల్లఉపాధి కోల్పోయిన ఆటో కార్మికులకు సంవత్సరానికి 12 వేలు చెల్లిస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చిందన్నారు. హామీలను నిలబెట్టుకోక పోతే సమ్మెను కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు చెలికాని శ్రీనివాస్, దయ్యాల శ్రీనివాస్, కుమార్, సంతోష్, దేవయ్య, రామంచ స్వామి, గుండె కిష్టయ్య, శ్రీనివాస్, ఎండి సలీం, అనిల్, రాజు, భాస్కర్‌రెడ్డి, శేఖర్, సంపత్, రాములు, కనకయ్య, ప్రశాంత్, వెంకటేష్ పాల్గొన్నారు.



ఆటోలు లేకపోవడంతో నడుచుకుంటూ వెళ్తున్న ప్రయాణికులు

## ధాన్యం.. వర్షార్పణం



జమ్మికుంట మార్కెట్లో కొట్టుకు పోయిన ధాన్యం

జమ్మికుంట, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో శనివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. పాత వ్యవసాయ మార్కెట్‌లో రైతులు ఆరోబోసిన ధాన్యం వరదకు కొట్టుకుపోయింది. సాయంత్రం నాలుగు గంటల సమయంలో మేఘాలు కమ్ముకున్నాయి. గమనించిన రైతులు హుటాహుటిన ధాన్యం ఒక్క దగ్గరికి కుప్పగా చేర్చారు. ఒక్కసారిగా వర్షం కురవడంతో ధాన్యం తడిసిముద్దయింది. అధికారులు చిరిగిన టార్పాలిన్లు ఇవ్వడం వల్లే ధాన్యం తడిసిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆబాది జమ్మికుంటకు చెందిన జక్కె సంపత్ అనే రైతు పది రోజుల క్రితం 30 క్వింటాళ్ల ధాన్యం విక్రయానికి తీసుకు వచ్చాడు. తేమ సాకుతో ఇన్ని రోజులు కొనలేదు. ఆకస్మికంగా వచ్చిన వర్షానికి ధాన్యం కొట్టుకు పోయిందని ఆవేదన వ్యక్తం చేశాడు. యార్డులో టార్పాలిన్లు లేవని, ఉన్నవి కూడా చిరిగిపోయి ఉన్నాయని, అధికారుల నిర్లక్ష్యం వల్లే తనకు నష్టం జరిగిందని అతడు వాపోయాడు.

## స్మార్ట్ సిటీ పేరుతో కరీంనగర్‌ను స్మాష్ చేశారు..

- తీగల వంతెన సాక్షిగా గంగుల అవినీతి
- పొన్నం కృషితోనే మానేరు రివర్‌ఫ్రంట్ రెండో దశకు నిధులు
- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, మేడిపల్లి సత్యం

కరీంనగర్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): స్మార్ట్ సిటీ పేరుతో కరీంనగర్‌ను స్మాష్ చేసిన ఘనత బీఆర్‌ఎస్ ప్రభుత్వానిదేనని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, మానకొండూర్, చొప్పదండి ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, మేడిపల్లి సత్యం ఓ ప్రకటనలో విమర్శించారు. జిల్లాపై కాంగ్రెస్ పార్టీ వివక్ష చూపిస్తున్నదని కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న వేళ ప్రజలను మభ్యపెట్టడానికి కరీంనగర్‌లో తీగల వంతెన పేరుతో అవినీతికి పాల్పడ్డారని విమర్శించారు. అసంపూర్తి, నాణ్యత లేని పనులతో నిర్మించిన తీగల వంతెన పరిస్థితి ఇప్పుడు ఎలా ఉందో ప్రజలందరికీ తెలుసన్నారు. తీగల వంతెన లోపాలు ఇప్పుడు స్పష్టంగా కనబడుతున్నాయన్నారు. లైటింగ్ వ్యవస్థ దెబ్బతిని ఆ ప్రాంతం అంధకారమయంగా మారిందన్నారు. వంతెనపై నిర్మించిన తారు రోడ్డు లేచిపోయి ప్రయాణికులు నానా ఇబ్బందులు పడుతున్నారన్నారు. తీగల వంతెన నిర్మాణంలో ఉన్న లోపాలను ప్రజలు ఎత్తి చూపుతారన్న భయంతో అధికారం కోల్పోయిన నాటి నుంచి ఇప్పటి వరకు గంగుల కమలాకర్ పరిశీలించలేదని విమర్శించారు. నిర్మాణ దశలోనే తీగల వంతెన కుంగిపోయిన విషయాన్ని గుర్తు చేస్తున్నామన్నారు. కరీంనగర్‌ను లండన్, న్యూయార్క్ సిటీలాగా అభివృద్ధి చేస్తామని చెప్పిన కేసీఆర్ రోడ్లను తవ్వి నగరాన్ని ధ్వంసం చేశారన్నారు. గంగుల కమలాకర్ నేతృత్వంలో నిర్మించిన ఏ రోడ్లను చూసినా నాణ్యత లోపించిన పనులతో దర్శనమిస్తున్నాయన్నారు. స్మార్ట్ సిటీ నిధుల్లో అవినీతి జరిగిందని, విచారణ జరిపించాలని బీఆర్‌ఎస్ నగర అధ్యక్షుడు, కార్పొరేటర్లు ఫిర్యాదు చేసినా గంగుల కమలాకర్ ఎందుకు నోరు మెదపడం లేదో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. పదేళ్ల పరిపాలనలో కరీంనగర్ నియోజక వర్గంలో ఒక్క డబుల్ బెడ్ రూం ఇల్లు కూడా అర్హులకు అందించకపోవడం వారి పరిపాలనకు నిదర్శనమని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ పాలనలో జిల్లాకు చెందిన మంత్రి పొన్నం ప్రభాకర్ మానకొండూర్, చొప్పదండి నియోజక వర్గాలకు ఒక్కో నియోజక వర్గానికి 150 కోట్లతో రెండు ఇంటిగ్రేటెడ్ హాస్టల్స్‌ను మంజూరు చేయించిన విషయాన్ని గ్రహించాలన్నారు. జిల్లా వ్యాప్తంగా ఏక కాలంలో రుణమాఫీ చేయడంతోపాటు సన్న వడ్లకు బోనస్ అందించిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందన్నారు. మానేరు రివరు ఫ్రంట్ రెండో దశ అభివృద్ధిలో భాగంగా 236 కోట్ల నిధులను మంజూరు చేయించిన ఘనత మంత్రి పొన్నం ప్రభాకర్‌దే అన్న విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. 14 ఏళ్లుగా పెరగని మెస్, కాస్మోటిక్స్ చార్జీలను పెంచి హాస్టల్ విద్యార్థులకు నాణ్యమైన ఆహారం, ఆరోగ్యకరమైన సేవలను అందిస్తున్నామన్నారు. కేసీఆర్ పాలనలో అభివృద్ధి పేరుతో ఏడు లక్షల కోట్ల అప్పులు చేశారని విమర్శించారు. కోట్ల రూపాయల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు, ఆరోగ్య శ్రీ చెల్లింపులు, కాంట్రాక్టర్లకు, సర్పంచులకు బిల్లులు చెల్లించక అవినీతి పాలన చేయడమే కాక, కాళేశ్వరం ప్రాజెక్టు పేరుతో వేల కోట్ల అవినీతికి పాల్పడిన చరిత్ర బీఆర్‌ఎస్ పార్టీదన్నారు. బీఆర్‌ఎస్ పదేళ్ల పాలనలో జిల్లాలో జరిగిన అభివృద్ధిపై, ఏడాదికాలంలో కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా పాలనలో జరిగిన అభివృద్ధిపై తీగల వంతెన సాక్షిగా చర్చకు రావడానికి ఆ పార్టీ నేతలు సిద్ధమా అని సవాలు విసిరారు.

# చిరు ధాన్యాలతో ఆరోగ్య సిరి



- ఉపయోగాలను ప్రజలకు వివరిస్తున్న పోలీస్ అధికారి
- వంద రకాల రెసిపీల రూపకల్పన
- యూట్యూబ్‌లో వీడియోలతో ప్రచారం

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

'తిండి కలిగితే కండ కలదోయ్.. కండ కలవాడేను మనిషోయ్' అనే గురజాడ మాటలను స్ఫూర్తిగా తీసుకున్నారు ఎస్ శ్రీనివాస్.. వృత్తిరీత్యా పోలీస్ సూపరింటెండెంట్ అయినా.. కరీంనగర్ పోలీస్ శిక్షణ కళాశాల ప్రిన్సిపాల్‌గా పోలీసులను తీర్చిదిద్దుతున్నా.. ఆరోగ్యవంతమైన సమాజం కోసం తనవంతు ప్రయత్నం చేస్తున్నారు. ప్రజలు ఆరోగ్యంగా ఉంటేనే దేశం శక్తివంతంగా తయారవుతుంది.. శక్తివంతమైన సమాజ నిర్మాణం కోసం ప్రజలను చైతన్య వంతులను చేయాలి.. ఆహారాన్ని మించిన ఔషధం కానీ, వైద్యం కానీ లేదు అని నమ్మే శ్రీనివాస్ ఆహారంపై దృష్టి సారించారు. చిరుధాన్యాలపై శాస్త్రీయ అధ్యయనం చేసి ప్రజల్లోకి వెళ్లి వారికి వివరించడమే కాకుండా చిరు ధాన్యాలతో రకరకాల వంటలు వండి తినిపించడం ప్రారంభించారు. పండగల సమయాల్లో, ఉత్సవాల సందర్భాల్లో, సెలవు దినాల్లో ఏదో ఒక కాలనీకి వెళ్లి చిరుధాన్యాల వినియోగంపై ప్రజలను చైతన్య వంతులను చేస్తూ వారు తమ ఆహారపు అలవాట్లను మార్చుకునేలా చూస్తున్నారు. చిరుధాన్యాలతో వంద రకాల రెసిపీలను తయారు చేసి యూట్యూబ్‌లో అప్‌లోడ్ చేసి ప్రజలను ఆ వంటలవైపు మళ్లిస్తున్నారు. వివిధ జిల్లాల్లో పర్యటిస్తూ చిరుధాన్యాల వినియోగం, ఉపయోగాలపై ప్రచారం చేస్తున్నారు. వృత్తిరీత్యా పోలీస్ అధికారిగా ఉంటూనే ఒక సామాజిక ఉద్యమకారుడిగా మారిన క్రమం ఆయన మాటల్లోనే..

### యువతలో ఫిట్‌నెస్ పెంచేందుకు..



ఎస్ శ్రీనివాస్

2013లో సైబరాబాద్‌లో పని చేస్తున్న సమయంలో 400 మంది కానిస్టేబుళ్లు శిక్షణ కోసం వచ్చారు. వారంతా ఉన్నత విద్యావంతులు. కఠిన శిక్షణ భారం చలేక 70 మంది అనారోగ్యం పాలయ్యారు. వారిలో ఫిట్‌నెస్ లేదని గుర్తించాను. అప్పుడు నా దృష్టి ఆహారంవైపు మళ్లింది. వారికి సంపూర్ణ ఆహారం కావాలి.. పోషకాలు విరివిగా ఉండే ఆహారం కావాలి.. అని ఆలోచించినప్పుడు మా బాల్యం గుర్తొచ్చింది. వ్యవ సాయ కుటుంబం నుంచి వచ్చిన మేము 1970 దశకంలో సజ్జ గడక, జొన్న గడక, చిరుధాన్యాల వంటలు తినేవాళ్లం. ఆదివారాలో, బంధువులు వస్తేనో, పండగ వస్తేనో బియ్యంతో వండిన అన్నం తినేవాళ్లం. ఆనాడు మేము, మా పెద్దలు తిన్న చిరుధాన్యాల ఆహారమే మమ్మల్ని ఆరోగ్యంగా ఉంచింది అని గుర్తించాను. చిరుధాన్యాలపై అధ్యయనం చేసి అవగాహన పెంపొందించుకున్నాం. తొమ్మిది రకాల చిరుధాన్యాలను కలిపి రవ్వగా చేసి దాన్ని పోలీస్ కానిస్టేబుళ్లకు ఆహారంగా అందించాం. చిరుధాన్యాల్లో ఉండే పోషక విలువలు తెలిపి మన పూర్వీకుల ఆహారం గురించి వివరించి వారిని ఒప్పించి ఆ ఆహారం తినేలా చేశాం. తొమ్మిది నెలల శిక్షణ కాలంలో ఏ ఒక్క కానిస్టేబుల్ కూడా అనారోగ్యానికి గురి కాలేదు. దీంతో మాకు చిరుధాన్యాల ఆహారంపై విశ్వాసం మరింత పెరిగింది. ఇప్పుడు కరీంనగర్ పోలీస్ శిక్షణ కేంద్రంలో శిక్షణ పొందే అందరికి చిరు, దాన్యాలతో వండిన వంటలే అందిస్తున్నాం. మా కేంద్రంలో పనిచేసే అధికారులతో పాటు శిక్షణ పొందిన అందరు కూడా ఈ ఆహారం తింటూ ఆరోగ్యంగా ఉండి తమ కుటుంబాల్లో కూడా ఇదే ఆహారాన్ని తీసుకుంటున్నారు.



మిల్లెట్స్ కిచిడీని పంపిణీ చేస్తున్న శ్రీనివాస్

### ఎన్నో ఉపయోగాలు

ఒక అధ్యయనం ప్రకారం భారతదేశం యువత అధికంగా ఉన్న దేశం. యువతలో ఉండాల్సినంత శారీ రక పటిష్ఠత ఉండడం లేదు. ఇందుకు ఆహారపు అలవాట్లు, జీవనశైలే కారణమని గుర్తించారు. గతంలో

మిగతా 6వ పేజీలో.....

## బీసీల రాజకీయ స్థితిగతులపై నివేదిక సమర్పిస్తా

- బీసీ డెడికేటెడ్ కమిషన్ చైర్మన్ భూసాని వెంకటేశ్వర్‌రావు

కరీంనగర్ టౌన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): బీసీలు ఏ విధంగా ఉన్నారు.. వారి రాజకీయ స్థితిగతులపై నివేదిక తయారు చేసి ప్రభుత్వానికి సమర్పిస్తామని బీసీ డెడికేటెడ్ కమిషన్ చైర్మన్ భూసాని వెంకటేశ్వర్‌రావు అన్నారు. శనివారం ఆ వివిధ కుల సంఘాల నాయకులు, ప్రతినిధుల నుంచి 25 విజ్ఞప్తులను స్వీకరించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ వెంకటేశ్వర్‌రావు మాట్లాడుతూ హైకోర్టు ఉత్తర్వుల మేరకు ప్రభుత్వం ఈ కమిషన్‌ను ఏర్పాటు చేసిందన్నారు. ఇప్పటికే కమిషన్ తొమ్మిది ఉమ్మడి జిల్లాల్లో పర్యటించి ప్రజలు, పార్టీల నుంచి అభిప్రాయాలు సేకరించిందని చెప్పారు. బీసీల్లో కొందరికే రిజర్వేషన్లు అందుతున్నాయని, బీసీలందరికి సంక్షేమ ఫలాలు అందేలా చూడాలని కొన్ని సంఘాల వారు తమ దృష్టికి తీసుకువచ్చారలన్నారు. జనాభా ప్రకారం రిజర్వేషన్లు అమలు చేయాలని ఆయా సంఘాల ప్రతినిధులు కోరినట్లు తెలిపారు. సమగ్ర సర్వే వివరాలు వచ్చిన తర్వాత ప్రభుత్వానికి తుది నివేదిక అందిస్తామని చైర్మన్ ప్రకటించారు. అంతకుముందు కమిషన్ చైర్మన్, సభ్యులకు అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, నగరపాలక సంస్థ కమిషనర్ చాహత్ బాజ్‌పాయి, ట్రైనీ కలెక్టర్ అజయ్ యాదవ్, ఆర్డీవో మహేశ్వర్, బీసీ సంక్షేమశాఖ అధికారి అనిల్ ప్రకాశ్ స్వాగతం పలికారు. కార్యక్రమంలో కమిషన్ సెక్రెటరీ బి సైదులు, రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ రమేశ్ పాల్గొన్నారు.

## ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి

భగత్‌నగర్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): అబద్ధాల హామీలతో ప్రజలను కాంగ్రెస్ మోసం చేసిందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి విమర్శిం చారు. శనివారం బీజేపీ పోరుబాట కార్యక్రమంలో భాగంగా కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను నిరసిస్తు శాతవాహన యూనివర్సిటీ నుంచి టవర్ సర్కిల్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. టవర్ సర్కిల్ వద్ద ఏర్పాటు చేసిన పోరుబాట సభలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో మారింది పాలకులే కాని పాలన ఏమాత్రం మారలేదన్నారు. కాంగ్రెస్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కేసీఆర్ అడుగు జాడల్లోనే నడుస్తున్నాడన్నారు. అన్ని వర్గాల ప్రజలను మోసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభు త్వాన్ని నిలదీ సేందుకు ప్రజల తరఫున బీజేపీ పోరు బాట పట్టిందన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు తాళ్లపల్లి శ్రీనివాస్‌గౌడ్, కళ్లె వాసుదేవరెడ్డి, కన్న కృష్ణ, ఎర్రబెల్లి సంపత్‌రావు, దుబాల శ్రీనివాస్, కొలగాని శ్రీనివాస్, శివకుమార్, ఎండీ ముజీబ్, వాసాల రమేష్, కన్నబోయిన ఓదేలు, కంచె శేఖర్, కడార్ల రతన్, అవదుర్తి శ్రీనివాస్, జాడి బాల్‌రెడ్డి, వంగల పవన్, బండ రమణరెడ్డి, నాగసముద్రం ప్రవీణ్ పాల్గొన్నారు.



## చంద్రుడు కాదు... సూర్యుడు

నిత్యం చండప్రచండంగా కనిపించే సూర్యుడు శనివారం చల్లని చంద్రుడిలా దర్శనమిచ్చాడు.. తుఫాన్ కారణంగా ఆకాశంలో మేఘాలు ఆవరించడంతో మబ్బుల మాటున సూర్యుడు ఇలా కనిపించాడు..

- కరీంనగర్ కల్చరల్,ఆంధ్రజ్యోతి

## 'శాతవాహన'లో ఉద్యోగాల పండుగ

- 50 కంపెనీలు హాజరు
- 427 మందికి ఉద్యోగాలు

- గణేశ్‌నగర్, ఆంధ్రజ్యోతి

5

# ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ధ్యేయం

- అభివృద్ధిని చూసి ఓర్వలేకనే బీఆర్‌ఎస్, బీజేపీ దుష్ప్రచారం చేస్తున్నాయి
- ప్రజాపాలన విజయోత్సవాల్లో మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి



మాట్లాడుతున్న మాజీ మంత్రి, ప్రజాపాలన విజయోత్సవాల కరీంనగర్ ఇన్‌చార్జి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి

కరీంనగర్ అర్బన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని, ఏడాది పాలనలో సబ్బండ వర్గాలు సంతోషంగా ఉన్నామని మాజీ మంత్రి, ప్రజాపాలన విజయోత్సవాల కరీంనగర్ ఇన్‌చార్జి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి అన్నారు. శనివారం డీసీసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కాంగ్రెస్ ప్రభుత్వ ఏడాది పాలన విజయ సంకల్ప సభకు ముఖ్యఅతిథిగా ఇంద్రకరణ్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ చరిత్రలో 21 లక్షల కోట్లు రైతురేణమాఫీ చేసిన ఘనత రేవంత్‌రెడ్డిరెడ్డి ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. వ్యవసాయ రంగంపై సంవత్సరంలో 54,280 కోట్ల రూపాయలను ఖర్చు చేసిన రైతు ప్రభుత్వంగా చరిత్ర సృష్టించిందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రోజుకు 18 గంటలు పనిచేస్తూ రాష్ట్రాన్ని అభవృద్ధిబాటలో నడిపిస్తున్నారని తెలిపారు. 10 ఏళ్లలో చేయని పనులు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత ఒకే సంవత్స రంలో చేస్తే.. ఆ పార్టీలు ఓర్వలేని తనంతో రాష్ట్ర ప్రభు త్వంపై దుష్ప్రచారం చేస్తున్నాయని విమర్శించారు. ఎన్ని అబద్దాలు ప్రచారం చేసినా ఆ పార్టీలను ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, తీసుకువచ్చిన సంక్షేమ పథకాలను ప్రచారం చేసుకునేందుకు ఒక పత్రిక, చానల్ అవసరమని, దీనిని అధి ~~ష్ఠానం దృష్టికి తీసుకువెళతానని ఇంద్రకర ణ్ రెడ్డి~~ అన్నారు. కష్టపడిన కాంగ్రెస్‌పార్టీ కార్య కర్తలు, నాయకులకు తప్పకుండా గుర్తింపు ఉంటు ందన్నారు. జిల్లాలో కేంద్రమంత్రి ఉన్నా జిల్లా, పార్లమెంట్ నియోజకవర్గా అభివృద్ధికి ఒక్క రూపాయి తేలేదన్నారు.

### బీఆర్‌ఎస్ నాయకులు ప్రభుత్వాన్ని విమర్శించడం సిగ్గుచేటు

సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి మాటా డుతూ పదేళ్ల అడ్డగోలుగా ప్రజాధనాన్ని లూటీ చేసిన బీఆర్ ఎస్ నాయకులు కాంగ్రెస్ ప్రభు త్వాన్ని విమర్శించడం సిగ్గుచేటన్నారు. ఎమ్మెల్యే గంగుల కమలాకర్ ప్రభుత్వ ధనాన్ని లూటీ చేసిన ఘనుడన్నారు. కేబుల్ బ్రిడ్జి నిర్మా ణం, డైనమిక్ లైటింగ్, ఇందిరాచౌక్ నిర్మాణ పనుల్లో కోట్లాది రూపాయలు అవినీతి జరిగిందని విమర్శిం చారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను చూసి ఓర్వలే నితనంతో బీజేపీ, బీఆర్‌ఎస్ నాయకులు విషప్రచారం చేస్తున్నారన్నారు. జిల్లా గ్రంథా లయ చైర్మన్ సత్తు మల్లేశం మాట్లాడుతూ ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి నాయ కత్వంలో ఏడాది కాలంలో ప్రజాపాలన అద్భుతంగా కొనసాగిందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఆరె పల్లి మోహన్, కరీంనగర్ అసెంబ్లీ ఇన్‌చార్జి పురమల్ల శ్రీనివాస్, నాయకులు వైద్యుల అంజన్ కుమార్, కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి, ఎండీ తాజ్, సమద్ నవాబ్, పులి ఆంజనేయులు గౌడ్, అరవింద్ కుమార్, మడుపు మోహన్, గడ్డం విలాస్‌రెడ్డి, కురం రాజేశం, రాచకొండ ప్రభాకర్, మల్యాల సుజిత్‌కుమార్, అబ్దుల్ రహమాన్, గుండాటి శ్రీనివాస్‌రెడ్డి, చర్ల పద్మ పాల్గొన్నారు.

### కార్యకర్తలకు గుర్తింపు లేదు...

ప్రజా పాలన విజయోత్సవంలో కాంగ్రెస్‌కు చెందిన పలువురు నాయకులు మాట్లాడుతూ పదేళ్ల నుంచి కష్టకాలంలో పార్టీ వెన్నంటే ఉండి ఎన్నికల్లో కీలకంగా పని చేసిన వారికి గుర్తింపు లేదని ఆవేదన వ్యక్తం చేశారు. యువజన కాంగ్రెస్ కరీంనగర్ అసెంబ్లీ అధ్య క్షుడు అబ్దుల్ రహమాన్, టీపీసీసీ మహిళ విభాగం ఉపాధ్యక్షురాలు చెర్ల పద్మ మాట్లాడుతూ క్షేత్ర స్థాయిలో పనిచేసిన కాంగ్రెస్ నాయకులు ఇప్పటికీ నిరు త్సాహంలో ఉన్నారన్నారు. భవిష్యత్తులో కార్యకర్తలను గుర్తింపు ఉండేలా పార్టీ అధిష్ఠానం తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

## క్రైం కార్నర్

### యువకుడి ఆత్మహత్య

కరీంనగర్ క్రైం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఆర్థికపరమైన ఇబ్బందులతో కుటుంబ పోషణ భారమై కరీంనగర్ రూరల్ మండలం నగునూర్ గ్రామానికి చెందిన మోదేపల్లి శివకుమార్(25) అనే యువకుడు శుక్రవారం అర్ధరాత్రి ఇంటిలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని కరీంనగర్ రూరల్ పోలీసులు తెలిపారు. శివకుమార్ అదే గ్రామానికి చెందిన యువతిని నాలుగు సంవత్సరాల కిందట ప్రేమ వివాహం చేసుకున్నాడు. దంపతులకు ఏడాది వయస్సు గల కూతురు ఉంది. శివకుమార్ కొంతకాలం ప్రైవేట్ ఆసుపత్రిలో పనిచేశాడు. జీతం సరిపోవటం లేదని మూడు నెలల కిందట ఉద్యోగం మానేశాడు. ఇంటివద్దనే ఉంటూ ప్లంబర్ పనిచేస్తుండేవాడు. డబ్బులు లేక కుటుంబపోషణ భారమవు తోందని శివకుమార్ బాధపడుతుండేవాడని మృతుడి భార్య పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. శుక్రవారం రాత్రి బంధువుల ఇంటిలో శుభకార్యం ఉండటంతో అక్కడి వెళ్లి తిరిగి రాత్రి శివకుమార్ ఒక్కడే ఇంటికి చేరుకున్నాడు. శనివారం ఉదయం కుటుంబసభ్యులు చూసే సరికి శివకుమార్ ఉరికి వేళాడు తూ కనిపించాడు. ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య చేసుకున్నాడని మృతుడి భార్య స్వరూప ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

### ఆటో ఢీకొని ఒకరి దుర్మరణం


కనకయ్య(ఫైల్)

తిమ్మాపూర్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నుస్తులాపూర్ గ్రామం వద్ద రాజీవ్‌రహదారిపై శుక్రవారం సాయంత్రం రోడ్డు దాటుతున్న వ్యక్తిని ఆటో ఢీకొట్టిన ప్రమాదంలో తీవ్రగాయాలై చికిత్స పొందు తూ మృతిచెందాడు. ఎల్ఎండీ పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నుస్తులాపూర్ గ్రామానికి చెందిన తమ్మనబోయిన కనకయ్య(63) తన గొర్రెలను మేతకు తీసుకెళ్లాడు. తిరిగి రాత్రి ఇంటికి గొర్రెలను తరలిస్తూ రోడ్డు దాటుతున్నాడు. ఆ సమయంలో అతి వేగంగా వస్తున్న ఆటో (టీఎస్36టీ5538) కనకయ్యను ఢీకొట్టింది. కనకయ్య కింద పడి తీవ్రగాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు కరీంనగర్‌కు తరలించారు. ఆస్పత్రిలో చికిత్సపొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందాడు. కనకయ్య కుమారుడు సంపత్ ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

### చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

మానకొండూరు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గట్టుదుద్దెనపల్లి గ్రామానికి చెందిన గొండ పెద్దన్న(65) అనే సింగరేణి విశ్రాంత ఉద్యోగి చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. కొంతకాలంగా పెద్దన్నకు ఇంటిముందు ఉన్న ఖాళీ స్థలం విషయంలో పక్కింటి వారితో గొడవలు జరుగుతున్నాయి. దీంతో తీవ్ర మనస్తాపా నికి గురై గత నెల 21న నిద్రమాత్రలు వేసుకున్నాడు. గమనించిన కుటుంబసభ్యులు చికిత్సనిమిత్తం కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. 17 రోజులుగా చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి శనివారం మృతి చెందాడు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ లక్ష్మీనారాయణ తెలిపారు.

### పురుగుల మందు తాగిన యువతి మృతి

వీణవంక, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): పురుగుల మందు తాగిన మండలంలోని చల్లూరు గ్రామానికి చెందిన ఎల్కపల్లి శిరీష (22) ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జమ్మికుంటకు చెందిన మైస శ్రీనాథ్ అనే వ్యక్తి శిరీషను పెళ్లి చేసుకుంటానని చెప్పి మోసం చేశాడు. దీంతో పాటు ఆమెను మానసికంగా వేధించడంతో మనస్తాపానికి గురైన ఆమె ఈ నెల 5వ తేదీన పురుగుల మందు తాగింది. కుటుంబ సభ్యు లు జమ్మికుంటలోని ఆస్పత్రికి తరలించారు. చికిత్సపొందుతూ శనివారం శిరీష మృతి చెందింది. శిరీష తల్లి ఎల్కపల్లి లక్ష్మి ఫిర్యాదు మేరకు ఆమె ఆత్మహత్యకు కారణమైన మైస శ్రీనాథ్, మైస సుశీల, మైస సారయ్యపై కేసు నమెదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తోట తిరుపతి తెలిపారు.

### రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు


ఎల్లారెడ్డిపేట డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లి బస్టాండ్ ప్రాంతంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. గొల్లపల్లి బస్టాండ్ సమీపంలోని కామారెడ్డి సిరిసిల్ల ప్రధాన రహదారి పక్కన అదే గ్రామానికి చెందిన మహిళ లక్ష్మి నిలబడి ఉంది. బోప్పాపూర్ లోని వ్యక్తి బోండ్ల బాలకిషన్ తన ద్విచక్ర వాహనంపై యూటర్న్ తీసుకుంటున్న క్రమంలో మహిళను ఢీ కొట్టినాడు. క్షతగాత్రులను మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నామని పోలీసులు వివరించారు.

### తంగళ్లపల్లిలో చోరీ


పగుల గొట్టి ఉన్న బీరువా

తంగళ్లపల్లి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి మండల కేంద్రంలో కోడం విజయ ఇంటికి తాళం వేసి ఊరు వెళ్లగా గుర్తు తెలియని దుండగులు తాళం పగులగొట్టి బీరువాలోని రూ. 90 వేల నగదు ఎత్తుకెళ్లారు. వారంరోజుల క్రితం కోడం విజయ కుటుంబం ముంబాయి వెళ్లగా శనివారం తెల్లవారుజామున ఇంటి తాళం పగులగొట్టి ఉండడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలాన్ని ఎస్ఐ రామ్మోహన్ పరిశీలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

# ఉద్యమాల చిరునామా మానాల


మానాల అటవీ ప్రాంతం



- నాడు సాయుధ శిక్షణ కేంద్రంగా అడవులు
- నేడు కనుమరుగవుతున్న వృక్ష సంపద
- అటవీ భూములను ఆక్రమిస్తున్న అక్రమార్కులు
- రక్షించాలని కోరుతున్న ప్రజలు


మానాలలో అమర వీరుల స్థూపం

రుద్రంగి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల జిల్లాలోని రుద్రంగి మండలం మానాల అడవులకు ఎంతో ఉద్యమ చరిత్ర ఉంది. మానాలలోని అడవులు, గుట్టల్లో సాయుధ దళాలకు శిక్షణ శిబిరాలను నిర్వహించేవారు. తెలంగాణ సాయుధ పోరాటం నుంచి మావోయిస్టు దళాల సభ్యుల వరకు ఇక్కడ శిక్షణ ఇచ్చేవారు. శిక్షణ అనంతరం రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లోని ఉద్యమాల్లో భాగస్వాములయ్యేవారు. ఆయా ప్రాంతాల్లో పోరాటాల్లో గాయపడిన సభ్యులకు ఈ ప్రాంతానికి తీసుకొచ్చి వైద్య సేవలు అందించేవారు. ఆ ఆనవాళ్లు ఇప్పుడు కనుమరగవుతున్నాయి. అక్రమార్కుల గొడ్డలి వేటుకు మానాల అడవుల్లోని వృక్ష సంపద, గుట్టలు అంతరించిపోతున్నాయి. ఉమ్మడి కరీంనగర్, నిజామాబాద్ జిల్లాల సరిహద్దులోని మానాల గిరిజన ప్రాంతం. ప్రస్తుతం నిజామాబాద్ జిల్లా నుంచి సిరిసిల్ల జిల్లా పరిధిలోకి మారింది. లోకం పోకడ ఎరుగని మారుమూల పల్లె మానాల, అక్కడి మనుషులకు ప్రపంచంతో సంబంధాలు ఉండేవి కావు. కానీ మానాల అంటే చరిత్ర పుటల్లో మాసిపోని పోరాట వేదిక. అమాయకులైన ఇక్కడి ప్రజలు అనేక పోరాటాలను గుండెల్లో పెట్టుకున్నారు. మానాల ఆడవులు దట్టమైనవి కావడంతో తెలంగాణ సాయుధ పోరాటంలో గెరిల్లా దళాలకు ఇక్కడ శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేసేవారు. శిక్షణ అనంతరం రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో తెలంగాణ రైతాంగ ఉద్యమంలో భాగస్వాములయ్యారు. ఆసియా ఖండంలోనే అతి పెద్ద మహిళా అమరవీరుల రెండో స్థూపం ఇక్కడ నిర్మించారు.

**● అడవుల్లోకి భూ అక్రమార్కులు**

ఉద్యమ చరిత్ర ఉన్న మానాల అడవుల్లోకి భూ అక్రమార్కులు


నరికివేతకు గురైన వృక్షం

చొరబడ్డారు. చెట్లను అక్రమంగా నరుకుతూ భూములను చదును చేస్తున్నారు. చట్టాల్లోని లొసుగులను ఆసరాగా చేసుకొని అటవీ భూముల ఆక్రమణకు పాల్పడుతున్నారు. వ్యవసాయ భూములుగా మారుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. రుద్రంగి మండల కేంద్రం శివారులోని బుగ్గరాజరాజేశ్వర స్వామి ఆలయం నుంచి మొదలుకొని మానాల వెళ్లే ప్రధాన రహదారి వెంట ఉన్న గాది గుట్ట తండా వరకు అటవీ ప్రాంతంలో సూమారు 40 నుంచి 50 ఎకరాల వరకు వృక్ష సంపదను నేల మట్టం చేశారు. సీమర్ల ఆటవి ప్రాంతంలోనూ భారీ వృక్షాలను నరికి వేశారు. మానాల గ్రామం శివారులో కొన్ని సంవత్సరాల క్రితం ఆటవీ ప్రాంతం అన్యాక్రాంతం కావడంతో ఆప్పటి అటవీ ఆధికారులు సూమారు 40 ఎకరాల్లో నీలగిరి మొక్కలతో ప్లాటేషన్ చేశారు. ఆయితే అవి వృక్షాలుగా మారాయి. ప్రస్తుతం కొద్ది రోజుల నుంచి నీలగిరి చెట్లను నరికి భూములను ఆక్రమించేందుకు కొందరు, కలపను అమ్ముకునేందుకు మరికొందరు చెట్లను నరికి వేస్తున్నారు. అంతే కాకుండా ఎంతో విలువైన టేకు కలప, వన మూలికల చెట్లను నరికి లక్షల రూపాయలు దండుకుంటున్నారు. దీంతో వన్యప్రాణులు గ్రామాల్లోకి చేరుతున్నాయి. అంతరించి పోతున్న అడవులను కాపాడాలని రెండు జిల్లాలోని ప్రజలు కోరుతున్నారు.

### రేషన్ బియ్యం పట్టివేత

వేములవాడ టౌన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ జిల్లా హుజురాబాద్ నుంచి రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను పట్టుకుని బియ్యాన్ని, ఒక వాహనాన్ని సీజ్ చేసినట్లు టాస్క్‌ఫోర్స్ సీఐ సదన్ కుమార్ శనివారం తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హుజురాబాద్ నుంచి వేములవాడ వైపు అక్రమంగా రేషన్ బియ్యాన్ని తరలిస్తున్నారని వచ్చిన సమాచారం మేరకు వేములవాడ పట్టణ పోలీసులతో కలిసి టాస్క్‌ఫోర్స్ పోలీసులు సంకెపల్లి వద్ద అదుపులోకి తీసుకున్నారు. 70 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని ఒక వాహనాన్ని పట్టుకుని సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా సీఐ సదన్‌కుమార్ మాట్లాడుతూ రేషన్ బియ్యాన్ని అక్రమ రవాణా చేస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. జిల్లావ్యాప్తంగా నిరంతర నిఘా పెడుతూ విస్తృతస్థాయిలో దాడులు నిర్వహిస్తున్నామని తెలిపారు. అక్రమ రేషన్‌బియ్యాన్ని తరలిస్తున్న వారిని అదుపులోకి తీసుకుని వేములవాడ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

**చందుర్తి:** చందుర్తి మండలం ఎనగల్ గ్రామ శివారులోని ఎస్ఆర్ఆర్ రైస్ మిల్లులో రేషన్ బియ్యం పట్టుకున్నట్లు డీటీసీఎస్ రవీంద్రచారి తెలిపారు. జిల్లా సివిల్ సప్లయ్ అధికారి వసంతలక్ష్మి ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. హుజూరాబాద్ నుంచి ఎనగల్ గ్రామశివారులోని రైస్‌మిల్లుకు తరలిస్తున్న 70 క్వింటాళ్ల బియ్యం, రైస్‌మిల్లును సీజ్ చేసినట్లు తెలిపారు. ఈ దాడుల్లో సిరిసిల్ల డీటీసీఎస్ నవీన్ పాల్గొన్నారు.

### పోక్సో కేసులో ఒకరి రిమాండ్

కరీంనగర్ క్రైం, డిసెంబరు 7: నగరానికి చెందిన ఓ బాలికతో అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై పోక్సో కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు వన్‌టౌన్ పోలీసులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. బాలిక కుటుంబసభ్యులు శుక్రవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడు శాస్త్రీరోడ్‌కు చెందిన మహ్మద్ సిరాజొద్దీన్‌ను అరెస్టు చేశారు. శనివారం రిమాండ్‌కు తరలించినట్లు సీఐ బిల్ల కోటేశ్వర్ తెలిపారు.

### సహజ వనరులను కొల్లగొడుతున్న మోదీ ప్రభుత్వం

**- సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి**



సమావేశంలో మాట్లాడుతున్న చాడ వెంకటరెడ్డి

సిరిసిల్ల టౌన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం దేశంలోని సహజ వనరులను కొల్లగొడుతోందని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి అన్నారు. శనివారం సిరిసిల్ల పట్టణం కార్మిక భవనంలో సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు అధ్యక్షతన పార్టీ రాష్ట్ర నాయకులు బాల మల్లేష్(రంగారెడ్డి), పోటు ప్రసాద్(ఖమ్మం) సంస్మరణ సభ నిర్వహించారు. అనంతరం విలేకరుల సమావేశంలో చాడ వెంకటరెడ్డి మాట్లాడారు. ఆదానీ, అంబానీ, నీరవ్ మోదీ బ్యాంకుల్లో అప్పులు తీసుకొని ఎగ్గొట్టి విదేశాల్లో దాక్కున్నారన్నారు. నీరవ్ మోదీని అప్పగించాలంటూ బ్రిటన్ ప్రభుత్వంపై ఎందుకు ఒత్తిడి తీసుకురాలేక పోతున్నారో ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం పాలన సంవత్సరకాలం పూర్తి చేసుకుందని సంబరాలు చేసుకుంటున్నారని, ఏడాదిలో రాష్ట్రంలో ఏం చేశారని ఒక్కసారి నెమరు వేసుకోవాలన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయాలన్నారు. సిరిసిల్ల పవర్‌లూం కార్మికుల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీపీఐ సిరిసిల్ల పట్టణ కార్యదర్శి పంతం రవి, నాయకులు మీసం లక్ష్మన్, కడారి రాములు, కేవీ అనసూయ, మల్లేశం, తిరుపతిరెడ్డి, విజయ్, రంజిత్, లక్ష్మి, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

### రాజన్నను దర్శించుకున్న ప్రముఖులు



హైకోర్టుకు జడ్జికి రాజన్న ప్రసాదం అందజేస్తున్న ఏఈఓ, కోడెమొక్కు చెల్లించుకుంటున్న డెడికేటెడ్ కమిషన్ చైర్మన్ వెంకటేశ్వరావు

వేములవాడ కల్చరల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారిని హైకోర్టు జడ్జి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప కుటుంబ సభ్యులు, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి, డెడికేటెడ్ కమిషన్ చైర్మన్ వెంకటేశ్వరరావు వేర్వేరుగా శనివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలో పాల్గొని రాజన్నకు కోడెమొక్కు చెల్లించుకున్నారు. అధికారులు రాజన్న ప్రసాదాన్ని అందించారు.

### రోడ్డుప్రమాదంలో పలువురికి గాయాలు

సుల్తానాబాద్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ ఆర్టీసీ బస్టాండ్ వద్ద శనివారం మధ్యాహ్నం జరిగిన ప్రమాదంలో పలువురు ప్రయాణికులు స్వల్పంగా గాయపడ్డారు. కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ డిపోనకు చెందిన ఆర్టీసీ బస్సు సుల్తానాబాద్ బస్టాండ్ లోకి వెళ్తుండగా కరీంనగర్ వైపు నుంచి రాజీవ్ రహదారిపై వేగంగా వచ్చిన ఓ వాహనం బస్సును ఢీకొంది. ప్రమాదంలో బస్సులోని ప్రయాణికులు కొందరు స్వల్పంగా గాయపడ్డారు.

### ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

కరీంనగర్ క్రైం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా ఇసుకను తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను కరీంనగర్ రూరల్ పోలీసులు శనివారం పట్టుకున్నారు. కరీంనగర్ రూరల్ మండలం గోపాల్‌పూర్ గ్రామం వద్ద ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్లను పట్టుకుని డ్రైవర్, యజమానులపై కేసు నమోదు చేశామని రూరల్ సీఐ ప్రదీప్‌కుమార్ తెలిపారు.

**వీణవంక:** మండలంలోని చల్లూరు గ్రా మంలో పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా గ్రామ శివారులోని మానేరు వాగు నుంచి అక్రమంగా ఇసుక రవాణ చేస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకున్నామని ఎస్ఐ తోట తిరుపతి శనివారం ఒక ప్రటనలో తెలిపారు. ట్రాక్టర్లను పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ పేర్కొన్నారు.

# ఆయిల్‌పామ్ సాగుపై రైతుల ఆసక్తి

- పలు ప్రోత్సాహకాలు కల్పిస్తున్న రాష్ట్రప్రభుత్వం
- తక్కువ పెట్టుబడి.. చీడపీడల బాధ లేదు
- టన్ను గెలలకు రూ. 20,413


వేగురుపల్లిలో సాగు చేస్తున్న ఆయిల్‌పామ్ పంట



మానకొండూర్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలంలోని వివిధ గ్రామాల్లోని రైతులు ఆయిల్‌పామ్ సాగుపై ఆసక్తి చూపిస్తున్నారు. మండలంలో ఏడు క్లస్టర్లలో 72 మంది రైతులు 250 ఎకరాల్లో ఆయిల్‌పామ్ పంటను సాగు చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి వివిధ రకాల సబ్సిడీలు అందుతుండడంతో ఎక్కువ మంది రైతులు ఆయిల్ పామ్ సాగుపై దృష్టి సారిస్తున్నారు. ఎక్కువగా పెట్టుబడి పెట్టాల్సిన అవసరం లేదు. ఒక్కసారి దిగుబడి ప్రారంభమైతే 40 ఏళ్ల వరకు ఆదాయం వస్తుంది. కూలీలు, కోతులు, పశువుల సమస్య లేకపోవడంతో రైతులు ఆయిల్‌పామ్ సాగుపై ఆసక్తి చూపుతున్నారు.

**● సబ్సిడీలు.. ప్రోత్సాహకాలు**

ఎకరం భూమిలో సుమారు 57 మొక్కలను నాటవచ్చు. వీటి సంరక్షణకు రాష్ట్రప్రభుత్వం డ్రిప్ సిస్టంపై ఎస్సీ, ఎస్టీలకు వంద శాతం, ఐదు ఎకరాల్లోపు సాగు చేస్తున్న బీసీ, ఓసీ రైతులకు 90 శాతం సబ్సిడీ ఇస్తుంది. ఐదు ఎకరాలపై సాగు చేసిన రైతులకు 80 శాతం సబ్సిడీ కాగా 20 శాతం జీఎస్టీని సదరు రైతు చెల్లించాల్సి ఉంటుంది. ఐదు ఎకరాల్లోపు ఉన్న సన్నకారు రైతుల తోటల్లో ఉపాధి హామీ పథకం ద్వారా ఉచితంగా మొక్కలకు గుంతలు తవ్వి ఎరువులను ఉచితంగా అందజేస్తారు. మొక్కలను సంరక్షించడానికి ఎకరాన రైతుకు ఏటా 4,200 రూపాయలు ప్రభుత్వం చెల్లిస్తుంది.



మానకొండూర్‌లో ఆయిల్‌పామ్ సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

**● ఎకరానికి రూ. 1.5 లక్షల ఆదాయం**

ఆయిల్‌పామ్ 30 నుంచి 40 ఏళ్ల పంట కాగా 36 నెలలకు పంట కోతకు వస్తుంది. ఎకరాన 10 టన్నుల దిగుబడి వస్తుంది. టన్నుకు 20,413 రూపాయల ధర ఉండడంతో రెండు లక్షల విలువైన పంట దిగుబడి వస్తుంది. పెట్టుబడులు, కూలీ ఖర్చులు ఎకరానికి 50 వేల రూపాయలు పోను రైతులకు సుమారు లక్షన్నర ఆదాయం వస్తుంది. పత్తి, మిర్చి, వరి ఇతర పంటల్లాగా ఆయిల్‌పామ్‌కు చీడపీడల బాధలేదు. ఎలాంటి వాతవరణ పరిస్థితులనైనా తట్టుకోవడం ఈ పంట ప్రత్యేకత. కోతులు ఇతర పశువులు ఈ గెలలను, చెట్లను ముట్టుకోవు. తక్కువ నీళ్ల ఉన్నప్పటికి డ్రిప్ సాయంతో సాగు చేయవచ్చు. దళారుల సమస్య లేకుండా ఫ్యాక్టరీలు ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలకు పంటను తీసుకవస్తే వారే కాంటా వేసి సరుకును తీసుకుంటారు. రెండు రోజుల్లో ఆన్‌లైన్ ద్వారా రైతుల ఖాతాల్లో డబ్బులు డిపాజిట్ అవుతాయి. ఆయిల్‌పామ్‌కు ఇవ్వాల్సిన ప్రోత్సాహకాలను ప్రభుత్వం ఎప్పటికప్పుడు రిలీజ్ చేస్తుంది. ఆయిల్‌పామ్ చెట్ల మధ్యలో అంతర పంటలను సాగు చేసుకొని అదనపు ఆదాయం పొందవచ్చు.

### ఏడెకరాల్లో సాగు

**- నందికొండ ముత్తారెడ్డి, రైతు, వేగురుపల్లి**



నాకు గ్రామంలో ఏడెకరాల వ్యవసాయ భూమి ఉంది. ఇందులో వరి, ఆరుతడి పంటలను సాగు చేసేవాడిని. ఈ పంటలను సాగు చేయడానికి పెట్టుబడితో పాటు కూలీల కొరత ఉండేది. దిగుబడి ఆశించిన స్థాయిలో రాలేదు. ఈ పరిస్థితుల్లో ఆయిల్‌పామ్ సాగు చేయాలనే ఆలోచన వచ్చింది. ముందుగా ఐదున్నర ఎకరాలలో ఆయిల్‌పామ్ సాగు చేశాను. మరో ఏడాదికి మిగతా ఎకరంన్నర భూమిలో మొక్కలను పెట్టాం. నీరు, కూలీల అవసరం తగ్గింది. పెట్టుబడి తగ్గింది. ఆయిల్ పామ్ మొక్కల మధ్య అంతర పంటలైన కూరగాయలు, బంతిపూలు సాగు చేశాము. మంచి లాభాలు వచ్చాయి. ప్రస్తుతం ఆయిల్‌పామ్ చెట్లకు గెలలు వచ్చి కోత దశకు వచ్చాయి. మార్కెట్లో ధర బాగుందని సంబంధిత అధికారులు చెప్పారు.

# భక్తుల మనోభావాలను దెబ్బతీస్తే ఊరుకునేది లేదు

**- రాజన్న ఆలయ కోడెల తరలింపుపై బీజేపీ, బీఆర్ఎస్ నాయకుల ధర్నా**

వేములవాడ కల్చరల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారి భక్తుల మనోభావాలు దెబ్బతీస్తే చూస్తూ ఊరుకునేది లేదని బీఆర్ఎస్ సీనియర్ నేత, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఏనుగు మనోహర్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ హెచ్చరించారు. వరంగల్ జిల్లా గీసుకొండలో కోడెలు పట్టుబడటంపై బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు విడివిడిగా రాజన్న ఆలయంలో నిరసన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ నాయకులు ఆలయ ఈవో కార్యాలయం ఎదుట బైఠాయించారు. ఆలయ ఈవో వినోద్‌రెడ్డిని సస్పెండ్ చేయాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకుడు ఏనుగు మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ ఎంతో నమ్మకంతో భక్తులు రాజన్నకు చెల్లించుకునే కోడెలను వరంగల్ జిల్లాకు చెందిన మంత్రి అనుచరుడైన రాంబాబుకు అందజేయడం సరికాదన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి, నాయకులు నిమ్మశెట్టి విజయ్, వంగల శ్రీకాంత్, నీలం శేఖర్, గోలి మహేష్, మారం కుమార్, వాసాల శ్రీనివాస్ తదితరులు ఉన్నారు. బీజేపీ పట్టణ అధ్యక్షుడు రేగుల సంతోష్‌బాబు ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు ఆలయ ఈవో కార్యాలయంలో బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. రాజన్న కోడెలు పక్కదారి పట్టాయని వస్తున్న అభియోగాలపై పూర్తిస్థాయిలో విచారణ చేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సగ్గు రాహుల్, నామాల శేఖర్, పిస్నింటి హన్మాండ్లు, రాజ్‌కుమార్, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

● వేములవాడ రాజన్న ఆలయ కోడెల తరలింపుపై బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ స్పందిస్తూ కోడెలు పక్కదారి ఘటనపై పూర్తిస్థాయిలో విచారణ చేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.


బీఆర్ఎస్ నాయకులతో మాట్లాడుతున్న ఈఓ వినోద్‌రెడ్డి

## ఉపాధ్యాయుల కొరతపై విద్యార్థులు, తల్లిదండ్రుల ధర్నా


పాఠశాల ఎదుట ధర్నా చేస్తున్న విద్యార్థులు, తల్లిదండ్రులు

గంభీరావుపేట, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దేశాయిపేట ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో ఉపాధ్యాయుల కొరతపై శనివారం విద్యార్థులు, తల్లిదండ్రులు పాఠశాలకు తాళం వేసి ధర్నా చేశారు. ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉండడంతో విద్యార్థులకు సరైన బోధన అందడం లేదని తల్లిదండ్రులు ఆరోపించారు. పాఠశాలలో ఏడు తరగతులకు ముగ్గురే ఉపాధ్యాయులు ఉండడంతో చదువులు ముందుకు సాగడం లేదన్నారు. ముగ్గురిలో ఒకరిని డిప్యూటేషన్‌పై పంపేందుకు మౌకిక ఆదేశాలు వచ్చాయని తెలిపారు. ఉపాధ్యాయుడిని డిప్యుటేషన్‌పై పంపే అంశాన్ని జిల్లా ఉన్నతాధికారులకు విన్నవించినా స్పందన లేకపోవడంతో ఆందోళన చేశామన్నారు. అనంతరం విద్యార్థులను పాఠశాల నుంచి ఇళ్లకు తీసుకెళ్లారు.

## ఏఆర్ హెడ్ క్వార్టర్స్‌లో అదనపు డీసీపీ తనిఖీలు


రికార్డులను తనిఖీ చేస్తున్న అదనపు డీసీపీ రాజు

కోల్‌సిటీ, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): రామగుండం పోలీస్ కమిషనరేట్ ఆర్మ్‌డ్ హెడ్ క్వార్టర్స్‌లో అదనపు డీసీపీ(అడ్మిన్) సీ రాజు శనివారం తనిఖీలు జరిపారు. సాయుధ దళ పోలీసు కవాతు తరువాత టర్న్ అవుట్ పరిశీలన జరిపారు. సెర్మోనల్ డ్రిల్ సిబ్బంది పరేడ్ తనిఖీ చేశారు. ఏఆర్ సిబ్బంది సమస్యలు తెలుసుకుని వాటికి త్వరలోనే పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చారు. ఏఆర్ సిబ్బంది సివిల్ సిబ్బందికి సహకారం అందిస్తున్నారని, లా అండ్ ఆర్డర్ పోలీసులతో సమానంగా పని చేస్తున్నారన్నారు. క్రమశిక్షణతో విధులు నిర్వహించాలన్నారు. ఆర్‌ఐ ఆఫీస్, రికార్డు రూమ్, బెల్లప్ ఆర్మ్స్, బీడీ టీమ్, డాగ్ స్క్వాడ్ తనిఖీలు జరిపారు. ఈ తనిఖీల్లో ఏఆర్ ఏసీపీ ప్రతాప్, ఆర్‌ఐలు దామోదర్, శ్రీనివాస్, మల్లేషం, సంపత్, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

## 'శాతవాహన'లో ఉద్యోగాల పండుగ

- మెగా జాబ్‌మేళాకు విశేష స్పందన - 50 కంపెనీలు హాజరు
- 427 మందికి ఉద్యోగాలు


కంపెనీ ప్రతినిధులతో మాట్లాడుతున్న వీసీ ఉమేష్‌కుమార్, రిటైర్డ్ ఐఏఎస్ చిరంజీవులు

గణేశ్‌నగర్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో శాతవాహన యూనివర్సిటీలో శనివారం మెగా జాబ్‌మేళాను నిర్వహించారు. ఈ మేళాకు విశేష స్పందన లభించింది. 50 కంపెనీలు జాబ్ మేళాలో పాల్గొన్నాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రిటైర్డ్ ఐఏఎస్ ఆధికారి చిరంజీవులు మాట్లాడుతూ శాతవాహన యూనివర్సిటీలో ఇంతపెద్ద జాబ్‌మేళా నిర్వహించడం అభినందనీయమన్నారు. ఉద్యోగం ఉరికే రాదని, కష్టపడి చదవాలని సూచించారు. ఎస్‌యూ ఉపకులపతి ప్రొఫెసర్ యు ఉమేష్‌కుమార్ మాట్లాడుతూ యూనివర్సిటీ స్థాయిలో మొట్టమొదటిసారిగా జాబ్‌మేళాను నిర్వహించామన్నారు. రెండువేల పైచిలుకు విద్యార్థులు ఉద్యోగాల కోసం రిజిస్ట్రేషన్ చేసుకున్నారని తెలిపారు. యూనివర్సిటీలో సంవత్సరంలో రెండుసార్లు జాబ్ మేళా నిర్వహిస్తామన్నారు. జాబ్ మేళాలో 2,649 మంది పాల్గొనగా 427 మంది నియామక పత్రాలు అందుకున్నారన్నారు. 845 మందిని షార్ట్‌లిస్ట్ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎం వరప్రసాద్, ప్లేస్మెంట్ డైరెక్టర్ డాక్టర్ ఇ మనోహర్ తదితరులు పాల్గొన్నారు.


నియామకపత్రాలు అందుకున్న అభ్యర్థులు



**● ఉద్యోగం రావడం ఆనందంగా ఉంది**

పావని, మంథని జేఎన్టీయూ

యూనివర్సిటీలో నిర్వహించిన జాబ్‌మేళాలో పాల్గొని ఉద్యోగం సాధించడం ఆనందంగా ఉంది. కార్యక్రమంలో పలు అంశాలపై అవగాహన కల్పించారు. నాకు అవకాశం కల్పించిన యూనివర్సిటీ అధికారులకు కృతజ్ఞతలు.



**● పలు అంశాలపై అవగాహన కల్పించారు..**

జి సాయిరిషీంద్ర, కరీంనగర్

జాబ్ మేళాలో పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఇది నాలో ఆత్మస్థయిర్యాన్ని నింపింది. మంచి కంపెనీలో ఉద్యోగం పొందాను. ఆనందంగా ఉంది.



**● మంచి కంపెనీలో ఉద్యోగం వచ్చింది..**

వైష్ణవి, హైదరాబాద్

ఉద్యోగానికి వెళ్లినప్పుడు ఇంటర్వ్యూదే ముఖ్యపాత్ర. ఇంటర్వ్యూలో ఎలా మాట్లాడాలి.. రెస్యూమ్ ఎలా తయారు చేసుకోవాలి అనే విషయాలపై అవగాహన కల్పించారు. మంచి కంపెనీలో ఉద్యోగం రావడం ఆనందంగా ఉంది.



**● ప్రముఖ కంపెనీలు.. ఒకే వేదికపై..**

- డి తేజవర్ధన్

రాష్ట్రంలోని ప్రముఖ కంపెనీలు యూనివర్సిటీలో ఒకే వేదికపై జాబ్‌మేళా నిర్వహించడం ఆనందంగా ఉంది. ఈ మేళా గ్రామీణ ప్రాంత యువతకు ఎంతో ఉపయోగకరంగా ఉంది. ఇంటర్వ్యూలకు హైదరాబాద్‌కు వెళ్లడం ఇబ్బందిగా ఉండేది. ఇక్కడికే అన్ని ప్రముఖ కంపెనీలు రావడంతో ఆర్థిక భారం తగ్గింది.



**● నా కల నెరవేరింది..**

- టి అరుణ్, శాతవాహన యూనివర్సిటీ

నేను శాతవాహన యూనివర్సిటీలో పీజీ చేస్తున్నాను. ఇక్కడే ఇంత పెద్ద జాబ్ మేళా నిర్వహించడం ఆనందంగా ఉంది. చదువు పూర్తికాగానే హైదరాబాద్ వెళ్లి జాబ్ చేద్దాం అనుకున్నా. ఈ మేళాలో ఉద్యోగం సాధించి నా కల నెరవేర్చుకున్నా..

---

ఆదివారం ప్రత్యేకం


శిథిలంగా మిగిలిన ఎడ్ల బండి చక్రాలు


మల్రెగడ్డలో ఫర్టిలైజర్ దుకాణం ఎదుట ప్రదర్శన కోసం షెడ్డులో నిలిపిన ఎడ్ల బండి

**ఒకప్పుడు** పల్లెటూరుకు వెళ్తే ఎడ్ల బండ్లు కనిపించేవి. ఇంటి ముందు బండి ఉందంటే ఎంతో గొప్పవాళ్లు అనేవాళ్లు. జోడెడ్ల బండి ఇంటికి ప్రత్యేక ఆకర్షణగా ఉండేది. ప్రధానంగా రైతులు వ్యవసాయ పనులకు రవాణా సాధనంగా వినియోగించేవారు. అదే బండిపై ఇంటిల్లిపాదీ జాతర్లకు, శుభకార్యాలకు వెళ్లేవారు. బయల్దేరే ముందు బండిని రంగురంగుల కాగితాలతో అలంకరించేవారు. ఒక ఇంట్లో ఎడ్ల బండి, కాడెద్దులు ఉంటే ఆ రైతును మోతబరి అనే వారు. బండి లేనివాళ్లు వారి అవసరాలకు అడిగి తీసుకెళ్లేవారు. ఇప్పుడు ఏదో ఒక పల్లెటూరిలో ఒకటి రెండు మాత్రమే కనిపిస్తున్నాయి. అన్నదాతలకు బతుకునిచ్చిన కచ్చురం కాలక్రమేణా వైభవాన్ని కోల్పోయింది.

## కనుమరుగవుతున్న కచ్చురం

**యంత్రాల రాకతో కనిపించని ఎడ్లబండ్లు**

● శిథిలాలుగా మిగిలిపోయిన పరిస్థితి

చందుర్తి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఎడ్ల బండ్లు చరిత్రకు ఆనవాళ్లుగా మిగిలాయి. సరైన రహదారి, రవాణాకు అంతగా వాహనాలు లేని రోజుల్లో కాడెద్దుల బండే రవాణా సాధనం. రైతులు పొద్దున్నే సద్దిగట్టుకొని ఎడ్లబండిపై పొలాలకు వెళ్లేవారు. ఎరువులు, విత్తనాలు, గ్రాసం, ఇలా దేన్నైనా ఎడ్లబండి మీదే తరలించేవాళ్లు. వ్యవసాయ సీజన్ ప్రారంభమవుతున్న సమయంలో ఎడ్ల బండ్లకు ఫుల్ డిమాండ్ ఉండేది. సీజన్ ఆరంభంలో పొలాలకు పెంట తరలించడం మొదటి పని, పొలం దున్నేందుకు అవసరమైన నాగళ్ల, గొర్రులను రైతులు ఎడ్లబండిపైనే తీసుకెళ్లేవారు. పండిన వడ్లు పట్టించేందుకు రైస్ మిల్లుకు వెళ్లే రవాణా సాధనమూ ఎడ్లబండే. ఇంట్లోకి కావాల్సిన వంట చెరుకు, పశువుల పాకలు, ఇల్లు కట్టేందుకు అవసరమైన కలప ఎడ్లబండ్ల పైనే తెచ్చేవారు. నాడు రవాణా సౌకర్యం అంతంతమాత్రం కాబట్టి ఇంటిల్లిపాదీ జాతరకు వెళ్లాలంటే ఎడ్లబండే బస్సు, కారు అన్నీ. బయల్దేరే ముందు బండిని రంగు రంగుల కాగితాలతో అలంకరించేవారు. ఒక ఇంట్లో ఎడ్ల బండి, కాడెద్దులు ఉంటే ఆ రైతును మోతబరి అనే వారు. బండి లేని వారు అద్దెకు ఎడ్లబండి తీసుకెళ్లేవారు. కలపతోనే కమ్మరులు చక్రాలు, బాడీతోపాటు బండికి అవసరమయ్యే విడి భాగాల తయారు చేసేవారు. వడ్రంగులు, కమ్మరుల పని ప్రదేశాలు హడావుడిగా కనిపించేవి. ఎడ్ల బండి తయారీకి అప్పట్లో చాలా తక్కువ ఖర్చయ్యేది. తయారీకి ఇరుసు, ఖానీ, నొగళ్లు, గొలుసు, సాయిసీలా, బడితెలు, కోలు అవసరమవుతాయి ఇప్పుడు అక్కడక్కడా ఇనుప చక్రాలతో తయారు చేసిన బండ్లు కనిపిస్తున్నాయి. ట్రాక్టర్ వచ్చి ఎడ్ల బండి మనుగడను తొక్కేసింది. క్రమక్రమంగా 'కాడెడ్ల కచ్చరం' కాలంలో కనుమరుగవుతోంది. ఎడ్ల బండి అంటే అప్పట్లో పిల్లల్లో క్రేజ్ ఉండేది. పెద్దలు ఎడ్లబండిపై పొలానికి వెళ్తున్నప్పుడు పిల్లలు కూడా సరదాగా ఎడ్ల బండి ఎక్కేవారు. ఇప్పటి పిల్లలకు ఎడ్లబండి అంటే ఏమిటో తెలియని పరిస్థితి. ఎడ్లు, ఎడ్లబండితోనే పొలం పనులు మొదలయ్యేవి. ఆ రోజులు మళ్లీ రావు. కాలం మారుతున్న కొద్దీ ఎడ్లబండ్ల సంస్కృతి పోతున్నది.


మూడపల్లిలో ఓ ఇంట్లో శిథిలమైన ఎడ్లబండి

**ఎడ్లబండి ఇంటికి కళ తెచ్చేది**

- ఇందూరి హరిబాబు, మల్రెగడ్డ



నాడు గ్రామాల్లో ఎడ్లబండ్లు ఎక్కువగా కనిపించేవి. ఎడ్లబండి ఉన్న ఇంటికి ప్రత్యేక ఆకర్షణ. ఇంటి ముందు బండి ఉందంటే ఎంతోగొప్ప. ఇంటికి కళ తెచ్చేది. ఎడ్ల బండి ఉన్న ఇంట్లో రెండు ఎడ్లు ఉండేవి. ఎక్కడికి వెళ్లాలన్నా ఎడ్లబండి మీదే వెళ్లేవాళ్లు, ఇప్పుడు అక్కడక్కడా ఒకటీ రెండు బండ్లు కనిపిస్తున్నాయి. అవి కూడా ఇనుముతో తయారు చేసినవి. కొన్ని టైరు బండ్లు. రాబోయే తరానికి ఎడ్ల బండి ఎలా ఉంటదనేది తెలియడం కోసం రేకుల షెడ్డు ఏర్పాటు చేసిన పాతకాలంనాటి ఎండ్లబండిని ప్రదర్శన కోసం ఉంచాను.

## ట్రేడ్ లైసెన్స్‌ల పేర సైబర్ నేరస్థుల ఫోన్ కాల్స్

- మున్సిపల్ కార్పొరేషన్ నుంచి మాట్లాడుతున్నామంటూ వ్యాపారులను నమ్మించే యత్నం

కోల్‌సిటీ, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరస్థులు ఏ అవకాశాన్ని వదులుకోవడం లేదు. ఇన్నాళ్లు లాటరీలు, పార్సిళ్లు, బ్యాంకులు, ఉద్యోగాల పేరుతో మోసగించిన సైబర్ నేరస్థులు ఇప్పుడు చిన్నచిన్న పట్టణాలు, గ్రామాల్లో చిన్నచిన్న వ్యాపారులకు సైతం ప్రభుత్వాధికారుల పేర ఫోన్ చేసి బెదిరిస్తూ దండుకుంటున్నారు. రామగుండం నగరపాలక సంస్థ కార్యాలయంలో నుంచి మాట్లాడుతున్నామంటూ శనివారం గోదావరిఖని పట్టణంలోని పలువురు వ్యాపారులకు ఫోన్లు చేసిన సైబర్ నేరస్థులు ట్రేడ్‌లైసెన్స్‌లు ఒకే దశ చెల్లించే అవకాశం వచ్చిందని, వెంటనే తాము చెప్పిన నంబర్‌కు ఫోన్ చేస్తే అప్‌డేట్ చేస్తామని, లేదంటే 45 రోజులు షాపు సీజ్ చేస్తామంటూ బెదిరింపులకు గురిచేశారు.

శనివారం మాతంగి కాంప్లెక్స్‌లోని ఒక సూపర్ మార్కెట్ యజమానికి, కళ్యాణ్‌నగర్ లోని మరో ఏజెన్సీ నిర్వాహకుడిగా, లక్ష్మీనగర్‌లోని మరో నలుగురు వ్యాపారులకు ఇదే తరహా ఫోన్లు వచ్చాయి. షాపు పేరు, యజమాని పేరు చెబుతూ ఒకే దఫా 9990 రూపాయలు చెల్లిస్తే భవిష్యత్‌లో ట్రేడ్ లైసెన్స్ చెల్లించే అవసరం ఉండదని, నగరంలో చాలా మంది వ్యాపారులు ఈ అవకాశాన్ని వినియోగించుకున్నారంటూ నమ్మించే యత్నం చేశారు. గత సంవత్సరం కూడా ఇదే తరహా పలువురు వ్యాపారుల నుంచి సైబర్‌నేరస్థులు డబ్బులు దండుకున్నారు. కాగా బీహార్, గుర్గావ్ తదితర ప్రాంతాల నుంచి సైబర్ నేరస్థులు తెలుగులో మాట్లాడుతూ ఈ తరహా మోసాలకు పాల్పడినట్టు తెలిసింది.

## జాతీయస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక

కరీంనగర్ స్పోర్ట్స్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఒరిస్సా రాష్ట్రంలోని భువనేశ్వర్‌లో జరగనున్న జాతీయస్థాయి జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలకు జిల్లాకు చెందిన ముగ్గురు క్రీడాకారులు ఎంపికయ్యారు. ఇటీవల వరంగల్‌లోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో జరిగిన తెలంగాణ రాష్ట్రస్థాయి జూనియర్ అథ్లెటిక్ చాంపియన్‌షిప్ పోటీల్లో పతకాలు సాధించిన జిల్లా క్రీడాకారులు విష్ణువర్ధన్, వినయ్, గైని నక్షత్ర జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరు ఈ నెల 8 నుంచి 11వ తేదీ వరకు జరగనున్న జాతీయ జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారని జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కడారి రవి తెలిపారు. ఈ సందర్భంగా క్రీడాకారులను, కోచ్‌లు వరుణ్ కృష్ణన్, తిరుపతిలను జిల్లా యువజన క్రీడాశాఖ అధికారి బి శ్రీనివాస్‌గౌడ్, జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు నందెల్లి మహిపాల్, అథ్లెటిక్స్ సంఘ సభ్యులు అభినందించారు.


క్రీడాకారులతో అథ్లెటిక్స్ సంఘం జిల్లా అధ్యక్షుడు నందెల్లి మహిపాల్

## రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్ పోటీలకు ఎంపిక


గణిత ప్రదర్శన చేస్తున్న విద్యార్థిని శ్రీహిత

కథలాపూర్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తక్కళ్లపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థిని రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్ పోటీలకు ఎంపికైంది. జిల్లా స్థాయిలో శనివారం నిర్వహించిన ఇన్‌స్పైర్ పోటీల్లో తక్కళ్లపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థిని శ్రీహిత మూడు కోణాల మొత్తం 180 డిగ్రీలు, చతుర్భుజంలోని నాలుగు కోణాలు 360 డిగ్రీలని కార్డులతో ప్రయోగపూర్వకంగా చేసిన ప్రదర్శన జిల్లా స్థాయిలో మొదటి స్థానంలో నిలిచి రాష్ట్రస్థాయికి ఎంపికైందని హెచ్‌ఎం మోటూరి రవీందర్ తెలిపారు. గైడ్ టీచర్‌గా గణిత ఉపాధ్యాయుడు యాగండ్ల గంగాధర్ వ్యవహరించారు. విద్యార్థిని శ్రీహితను తెలంగాణ గణిత ఫోరం రాష్ట్ర సలహాదారు రాంప్రసాద్, డీసీఈబి కార్యదర్శి మురళీమనోహరాచారి, పరీక్షల కమీషనర్ రాజమౌళి, ఎంఈవో లోకిని శ్రీనివాస్ అభినందించారు.

## రోడ్డుపై రూ. మూడు లక్షలు

**పోలీసులకు అప్పగించిన వ్యాపారస్తులు**


సీఐకి డబ్బు అప్పగిస్తున్న మారుతి, కిరణ్

మెట్‌పల్లి టౌన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మెట్‌పల్లి పట్టణంలో రోడ్డుపై పడి ఉన్న మూడు లక్షల నగదును కొందరు వ్యాపారులు గమనించి వెంటనే వాటిని పోలీసులకు అప్పజెప్పారు. పట్టణంలోని పాత బస్టాండ్ చావిడికి వెళ్లే మార్గంలో మారుతి మసాల దుకాణం ముందు 500 రూపాయల నోట్ల కట్టలు (3 లక్షల రూపాయలు) పడి ఉండడాన్ని షాపు యజమానులు సామా మారుతి, కంభంపాటి కిరణ్‌కుమార్ గమనించారు. వెంటనే వాటిని మెట్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో సీఐ నిరంజన్ రెడ్డికి అప్పగించారు. ఈ సందర్భంగా సీఐ నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ ఎవరివైన డబ్బులు పోగొట్టుకుంటే సరైన ఆధారాలు సమర్పించి డబ్బులు తీసుకెళ్లాలని కోరారు. మానవత్వంతో డబ్బులు అప్పగించిన మారుతి, కిరణ్‌ను సీఐ అభినందించారు.

**బావిలో దూకి మహిళ ఆత్మహత్య**

ఇబ్రహీంపట్నం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోధూర్ గ్రామానికి చెందిన తెలుకంటి శ్యామల(55) శనివారం గ్రామ శివారులోని వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. ఇబ్రహీంపట్నం ఎస్‌ఐ అనిల్ తెలిపిన వివరాల ప్రకారం.. శ్యామలకు పదేళ్ల నుంచి మానసిక స్థితి బాగలేదు. ఎన్ని ఆసుపత్రుల్లో చూపించినా ఆరోగ్యం మెరుగుపడకపోవడంతో మానసికంగా కుంగిపోయి ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. మృతురాలి భర్త నర్సయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

## వైభవంగా సుబ్రహ్మణ్య స్వామి కల్యాణం


కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు, అయ్యప్ప స్వాములు


మల్లన్న జాతరలో నృత్యాలు చేస్తున్న శివసత్తులు


మల్లన్న బోనాలతో ఊరేగింపుగా వెళ్తున్న గ్రామస్థులు

- ప్రత్యేక పూజల్లో పాల్గొన్న అయ్యప్పస్వాములు, భక్తులు

కోరుట్ల, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): సుబ్రహ్మణ్య షష్టి పురస్కరించుకుని జ్ఞాన సరస్వతిమాత శనైశ్చర సహిత అయ్యప్ప స్వామి దేవాలయంలో శనివారం సుబ్రహ్మణ్య స్వామి కల్యాణం వైభవంగా నిర్వహించారు. వేదపండితులు పాలెపు రాంశర్మ, వినయ్ శర్మ మంత్రోచ్చారణల మధ్య ప్రత్యేక పూజలు జరిపారు. ఆలయంలో అర్చన అభిషేక కార్యక్రమాలను జరిపారు. సుబ్రహ్మణ్య స్వామి ఆలయంలో అర్చన అభిషేక కార్యాక్రమాలను నిర్వహించి ప్రత్యేక వేదిక ద్వారా వల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి కల్యాణం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అయ్యప్ప స్వాములు చేసిన భజన కార్యక్రమంతో ఆలయ ఆవరణ మారుమోగింది. మెదట సుబ్రహ్మణ్య స్వామి ఉత్సవ విగ్రహాన్ని ఊరేగింపు తీసుకరాగా మహిళలు మంగళ హారతులతో స్వాగతం పలికారు. భక్తులకు గుండేటి నాగరాజు - రాధ దంపతులు అన్న ప్రసాదం అందించారు. ఈ కార్యక్రమంలో దేవాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు అంబటి శ్రీనివాస్, దేవాలయ కమిటి సభ్యులు తోట రాజు, కాసు కాంగ్రి జుంబర్తి రమేష్, గట్ల ఆనంద్, నిమిషకవి నాగరాజు, మరిపల్లి రవీగౌడ్ పాల్గొన్నారు.

**ఘనంగా మల్లన్న జాతర**

**కోరుట్ల రూరల్:** షష్టి పర్వదినం పురస్కరించుకుని మండలంలోని అయిపూర్ గ్రామంలో మల్లన్న జాతర మహోత్సవాన్ని గ్రామస్థులు ఘనంగా నిర్వహించారు. యాదవ సాంప్రదాయ ప్రకారం ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గుట్టపై మల్లన్న దేవుడికి పరిసర గ్రామాల భక్తులు పూజలు చేశారు. మహిళలు నెత్తిన బోనాలను పెట్టుకొని గ్రామం నుంచి మల్లన్న ఆలయం వరకు ఊరేగింపు నిర్వహించారు. మహిళలు బోనాల శోభాయాత్రలో శివసత్తులు, పోతరాజుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. బోనాలను మల్లన్నకు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కోరుట్ల మాజీ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు విద్యాసాగర్‌రావు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ తోట నారాయణ, సర్పంచ్ ఫోరం జిల్లా మాజీ అధ్యక్షుడు దారిశెట్టి రాజేష్, మాజీ సర్పంచ్ పిడుగు రాధ- సందయ్య గ్రామస్థులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గణేష్‌నగర్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): నగరంలోని పలు ప్రదేశాల్లో ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని కరీంనగర్ టౌన్-1 ఏడీఈ పంజాల శ్రీనివాస్‌గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. డంప్‌యార్డు, బీఎస్ఎన్ఎల్ టవర్ ఏరియా, కోతిరాంపూర్, ఆటోనగర్ ప్రాంతాల్లో ఆదివారం ఉదయం 9 గంటల నుండి 11గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

### ● అవీ.. ఇవీ

● కరీంనగర్ కల్చరల్: అభ్యుదయ రచయితల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 10 గంటలకు భగత్‌నగర్ భగవతి హైస్కూల్‌లో సాహితీవేత్త డాక్టర్ కాలువ మల్లయ్య రచించిన 'మంచి అన్నది మాల అయితే' 'పదహారు గంటల యాదిలో' నవలలు, 'గంప' సాహిత్య వ్యాసాలు మూడు పుస్తకాల ఆవిష్కరణలు జరుపనున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు.

● భవానీ సాహిత్య వేదిక ఆధ్వర్యంలో కాశ్మీరగడ్డలోని ఐఎంఐ హాల్లో వేదిక అధ్యక్షుడు వైరాగ్యం ప్రభాకర్ నేతృత్వంలో వెలువడిన నూరవ పుస్తకం 'స్మరించుకుందాం' పుస్తకావిష్కరణ సభను ఆదివారం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు.

● నగరంలోని పలు ఆలయాల్లో శనివారం సుబ్రహ్మణ్య షష్టి పూజలను నిర్వహించారు.

● భగత్‌నగర్: కొత్తపల్లి ఎంపీడీవోగా జగన్నాథం శ్రీనివాస్ బాధ్యతలు స్వీకరించారు. కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్‌ను కలిసి పూల మొక్కను అందించారు.

● నగరంలోని సెయింట్‌జార్జ్ నిసోస్ బ్లాక్ (సిబిఎస్ఈ)లో శనివారం చిన్నారులు కూరగాయల మార్కెట్ నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ ఫాతిమారెడ్డి మాట్లాడారు.

● తెలంగాణ రాష్ట్ర గొర్రెల మేకల పెంపకందారుల సంఘం రాష్ట్ర నాయకుడు బాల మల్లేష్ సేవలు చిరస్మరణీయమని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొమ్ము అశోక్ యాదవ్‌అన్నారు. శనివారం నగరంలో బాల మల్లేష్ సంతాప సభ నిర్వహించారు.

● కరీంనగర్ రూరల్: నగునూర్‌లోని దుర్గాభవానీ ఆలయంలో సుబ్రహ్మణ్యస్వామి కళ్యాణాన్ని శనివారం పురాణం మహేశ్వరశర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు.

● ఇందిరమ్మ ఇండ్ల సర్వేసర్వేలో కార్యదర్శులను మినహాయించాలని శనివారం కరీంనగర్ మండల కార్యదర్శులు ఎంపీడీవో సంజీవరావుకు వినతిపత్రం అందించారు.

● బొమ్మకల్‌లోని శ్రీకొచ్చగుట్ట మల్లికార్జున స్వామి ఆలయంలో మహాదండి వారం పురస్కరించుకుని శనివారం ఒగ్గు పూజారి సాయిల్ల శివయ్య ఆధ్వర్యంలో దండి పట్నం వేశారు.

# పోలింగ్ కేంద్రాల ముసాయిదా జాబితా విడుదల

కరీంనగర్ రూరల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ మండలంలో శనివారం అధికారులు పోలింగ్ కేంద్రాల ముసాయిదా జాబితాను శనివారం విడుదల చేశారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో సంజీవరావు, ఎంపీవో జగన్మోహన్‌రెడ్డి గ్రామాల వారీగా ఓటర్లు, పోలింగ్ కేంద్రాల ముసాయిదా జాబితాను నోటీస్ బోర్డులో అంటించారు. 17 గ్రామ పంచాయతీల్లో జాబి తాను కార్యదర్శులు ఏర్పాటు చేశారు.

కరీంనగర్ మండలంలో 17 గ్రామాల్లో మొత్తం 40,424 మంది ఓటర్లు ఉండగా పురుషులు 19,713 మంది, మహిళలు 20,710, ఇతరులు ఒకరు ఉన్నారు. కరీంనగర్ మండలంలో మొత్తం 184 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయగా అత్యధికంగా బొమ్మకల్ గ్రామంలో 28 కేంద్రాలు ఉన్నాయి.

**● విలీన ప్రతిపాదిత గ్రామాల్లోనూ జాబితా**

కరీంనగర్ మండలంలో పలు గ్రామాలను



జాబితాను విడుదల చేస్తున్న కరీంనగర్ రూరల్ ఎంపీడీవో సంజీవరావు

కార్పొరేషన్‌లో విలీనంపై ఎలాంటి ఆదేశాలు రాకపోవడంతో ప్రతిపాదన గ్రామాల్లో ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నారు. కరీంనగర్ కార్పొరేషన్ శివారు గ్రామ పంచాయతీలైన బొమ్మకల్, గోపాల్‌పూర్, దుర్శేడ్, చింతకుంట, మల్కాపూర్, కొత్తపల్లి మున్సిపాల్టీలను విలీనం చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ కలెక్టర్ పమేలా సత్పతికి ప్రతిపాదన చేశారు. అయితే విలీనాన్ని పలువురు గ్రామస్థులు వ్యతిరే కిస్తున్నారు. పోలింగ్ కేంద్రాలపై అభ్యంతరాల స్వీకరణకు అవకాశం కల్పించింది. శనివారం నుంచి ఈనెల 12వ తేదీ వరకు ఫిర్యాదు చేసే వీలు కల్పించింది.

12న మండల స్థాయి రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేయనున్నారు. 17న తుది పోలింగ్ కేంద్రాల జాబితాను అధికారులు ప్రకటించనుండటంతో గ్రామాల్లో స్థానిక సంస్థల ఎన్నికల సందడి నెలకొంది.

● సైదాపూర్: గ్రామ పంచాయతీ సాధారణ ఎన్నికలలో భాగంగా రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు అన్ని గ్రామ పంచాయతీ వార్డుల వారీగా పోలింగ్ కేంద్రాల ముసాయిదా జాబితా విడుదల చేసినట్లు ఎంపీడీవో యాదగిరి తెలిపారు. అన్ని గ్రామ పంచాయతీ ప్రధాన కూడళ్లు, మండల పరిషత్ కార్యాలయంలో జాబితాను ప్రదర్శించామన్నారు.

## చిరుధాన్యాలతో ఆరోగ్య సిరి

(3వ పేజీ తరువాయి)

ఆహారంలో చిరుధాన్యాలదే అగ్రస్థానంగా ఉండేది. తర్వాత వరి, గోధుమ పంటలు పెరిగి వాటిని ఆహార ధాన్యాలుగా తీసుకోవడం ప్రారంభమయింది. క్రమంగా చిరుధాన్యాల వినియోగం తగ్గింది. విటమిన్లు, ప్రొటీన్లు, పోషక పదార్థాలు ఎక్కువగా ఉన్న చిరుధాన్యాలను వినియోగించడం ద్వారా ఆరోగ్యాన్ని మెరుగుపర్చుకోవచ్చు అని ఎన్నో అధ్యయనాలు నిరూపించాయి. మనం తినే ఆహారానికి, మన భావోద్వేగాలకు ఎంతో సంబంధం ఉన్నది. మనిషికి అవసరమైన హ్యాపీ కెమికల్స్ నాలుగు. ఆ నాలుగు కెమికల్స్ చిరుధాన్యాల్లో ఉంటాయి.

**● రుచికరం.. ఆరోగ్యకరం**

చిరుధాన్యాల వంటలు తినడానికి రుచికరంగా ఉండవనే కారణంగా చాలామంది వీటికి దూరంగా ఉంటున్నారు. ఈ పరిస్థితిని మార్చడానికి వంద రకాల వంటల రెసిపీలను తయారు చేశాం. ఆయా వంటలను వండి pouki_tv యూట్యూబ్ చానల్‌లో పోస్టు చేస్తున్నాం. ఆ వంటలనే వివిధ సందర్భాలలో ప్రజల వద్దకు వెళ్లినప్పుడు వండి వడ్డిస్తున్నాం. దీంతో ప్రజలు ఆ ఆహారాన్ని మెచ్చుకుని స్వయంగా వాటిని వండుకుంటూ తింటున్నారు. చిరుధాన్యాల వినియోగంపై ప్రజల్లో అవగాహన కల్పించడానికి ప్రయత్నిస్తున్నాను. ఏ అవకాశం దొరికినా అక్కడికి వెళ్లి చిరుధాన్యాల వినియోగాన్ని, ప్రయోజనాలను వివరిస్తూ ఎంత రుచిగా వాటిని వండుకోవచ్చో స్వయంగా వండి చూపిస్తున్నాను.

## మైన్స్ ఏడీ రామాచారి సస్పెన్షన్

కరీంనగర్ క్రైం, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): గనులు, భూగర్భ శాఖలో కరీంనగర్ అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న రామాచారి సస్పెన్షన్ అయ్యారని సమాచారం. ఈ మేరకు ఉన్నతాధికారుల నుంచి ఉత్తర్వులు జారీ అయినట్లు తెలిసింది. కరీంనగర్ జిల్లాలో 2013లో గ్రానైట్ క్వారీలకు సంబంధించిన వ్యవహారంలో జరిగిన అవకతవకలపై సస్పెన్షన్ చేసినట్లుగా తెలుస్తోంది.

## నిబంధనలు పాటించని కాలేజీలపై చర్య తీసుకోవాలి



ఇంటర్ బోర్డు కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

భగత్‌నగర్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ముందస్తు అడ్మిషన్లు చేస్తున్న ప్రైవేట్, కార్పొరేట్ జూనియర్ కళాశాలలపై చర్యలు చేపట్టాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గజ్జెల శ్రీకాంత్ అన్నారు. శనివారం భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఇంటర్మీడియెట్ బోర్డు కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టి సీనియర్ అసిస్టెంట్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు రోహిత్, జిల్లా సహాయ కార్యదర్శి భోగేశ్వర్, జిల్లా కమిటీ సభ్యులు రత్నం సురేష్, గట్టు ఆకాశ్, నాయకులు పాల్గొన్నారు.

# మెడికవర్ ఆసుపత్రి ఫ్యామిలీ కార్డు

సుభాష్‌నగర్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని మెడికవర్ ఆసుపత్రి కొత్తగా ఫ్యామిలీ కార్డును ప్రవేశపెట్టింది. శనివారం మున్సిపల్ కమిషనర్ చాహత్‌బాజ్‌పాయ్ ఈ కార్డును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మెడికవర్ ఆసుపత్రి సెంటర్ హెడ్ గుర్రం కిరణ్ మాట్లాడుతూ పేషంట్ 500 రూపాయలతో ఫ్యామిలి కార్డు తీసుకుంటే డాక్టర్ కన్సల్టెంట్‌లో 25శాతం, రక్త పరీక్షలపై 15శాతం, డేకేర్, క్యాష్ అడ్మిషన్ సేవలపై 10శాతం డిస్కౌంట్ ఉంటుందని తెలిపారు. హెల్త్‌కేర్ సేవలపై 30శాతం, 20శాతం మందులపై, హెల్త్ చెకప్స్‌పై 10శాతం డిస్కౌంట్ ఉంటుందన్నారు. ఆసుపత్రి నుంచి 10 కిలోమీటర్ల దూరం వరకు ఉచిత అంబులెన్స్ సేవలు అందుబాటులో ఉంటాయన్నారు. ఈ కార్డు పొందినవారు దేశంలో ఏ మెడికవర్ ఆసుపత్రిలోనైనా చికిత్స చేయించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో తిరుపతి రెడ్డి, మాదాని చంద్రశేఖర్, ఆసుపత్రి మార్కెటింగ్ హెడ్ కోట కరుణాకర్, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.



కార్డును ఆవిష్కరిస్తున్న మున్సిపల్ కమిషనర్ చాహత్‌బాజ్‌పాయ్

# క్షయ నివారణ ప్రచార వాహనం ప్రారంభం

సుభాష్‌నగర్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): క్షయ(టీబీ) నివారణ ప్రచార వాహనాన్ని అదనపు కలెక్టర్ ప్రఫుల్‌దేశాయ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా టీబీ నియంత్రణ అధికారి డాక్టర్ రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ క్షయ నివారణలో భాగంగా కేంద్ర ప్రభుత్వం నిక్షయ్ శిబిర్ పేరుతో కార్యక్రమాన్ని నిర్వహిస్తుందన్నారు. ఇందులో భాగంగా ప్రజల్లో క్షయ వ్యాధి రావడానికి ఎక్కువగా అవకాశం ఉన్న వారిని గుర్తించి వారికి పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. వ్యాధి నిర్ధారణ అయినవారికి సకాలంలో చికిత్స ఇవ్వడం ద్వారా వ్యాధిని నివారించవచ్చన్నారు. ఇందుకు సంబంధించిన ప్రచార వాహనం జిల్లాలో ప్రారంభమైందన్నారు. వచ్చే మార్చి 24 వరకు ఈ వాహనం పర్యటిస్తుందని తెలిపారు.

వ్యాధి లక్షణాలు ఉన్నవారు స్వచ్ఛందంగా ప్రభుత్వాసుపత్రిలో ఉచితంగా పరీక్షలు చేయించుకోవాలని జిల్లా టీబీ నియంత్రణ అధి కారి డాక్టర్ రవీందర్‌రెడ్డి సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డీవో మహేశ్వర్, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## 'ఇందిరా మహిళాశక్తి'ని సద్వినియోగం చేసుకోండి

కరీంనగర్ టౌన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన ఇందిరా మహిళాశక్తి పథకంలో భాగంగా కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యంగా పనిచేస్తుందని, దీన్ని సద్వినియోగం చేసుకొని వ్యాపారాలను అభివృద్ధి చేసుకోవాలని మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ స్వరూపరాణి స్వశక్తి మహిళలకు పిలుపునిచ్చారు. శనివారం నగరపాలక సంస్థ కార్యాలయంలో సిరి, మల్లికార్జున పట్టణ సమాఖ్య సర్వసభ్య సమాఖ్య సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో డిప్యూటీ టీఎంసీ, ఆర్‌పీలు, సమాఖ్యల ఈసీ, ఓబీలు పాల్గొన్నారు.

## బీజేపీ నాయకుల బైక్ ర్యాలీ

కరీంనగర్ రూరల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను నిరసిస్తూ శనివారం కరీంనగర్ మండలం బొమ్మకల్ గ్రామంలో బీజేపీ నాయకుల ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు పాశం తిరుపతి, సదానందం, పుట్టపాక శ్రీధర్, పెద్ది లక్ష్మణ్, గాలిపల్లి నారాయణ, శ్రీకాంత్ పాల్గొన్నారు.

## ఆటో డ్రైవర్ల ధర్నా

కరీంనగర్ రూరల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మహిళలకు ఉచిత బస్సు పథకాన్ని ఎత్తి వేయాలని శనివారం నగునూర్ ప్రధాన రహదారి ఆటో యూనియన్ అధ్యక్షుడు బొగ్గుల మల్లేశం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో నగునూర్ గ్రామ అధ్యక్షుడు కొత్తకొండ సుభాస్, ఎలబోతారం గ్రామ అధ్యక్షుడు కొమురయ్య, చామనపల్లి అధ్యక్షుడు లింగపెల్లి రాజు, చెర్లబూత్కూర్ సత్తీష్, వండ్ల కొండ నర్సయ్య, కరీంనగర్ యూనియన్ కార్యదర్శి కొడిముంజ తిరుపతి, జెఎసి ఇంచార్జి అవాలీ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించాలి

కరీంనగర్ టౌన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): జనాభా ప్రాతిపదికన ముస్లిం, మైనార్టీలకు 12శాతం రిజర్వేషన్లు కల్పించాలని ఎంఐఎం నగర అధ్యక్షుడు గులాం అహ్మద్ కోరారు. శనివారం కరీంనగర్‌కు వచ్చిన బీసీ డెడికేటెడ్ కమిషన్‌కు ఆయన వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ అబ్బాస్ సమి, ఎంఐఎం నగర ప్రధాన కార్యదర్శి సయ్యద్ బర్కత్ అలీ పాల్గొన్నారు.

## జూడోలో బంగారు పతకం సాధించాలి

కరీంనగర్ స్పోర్ట్స్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి జూడో పోటీల్లో స్వర్ణ పతకం సాధించాలని అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ అన్నారు. కరీంనగర్ ప్రాంతీయ క్రీడా పాఠశాలకు చెందిన రేవతి జాతీయస్థాయి అండర్-17 జూడో పోటీలకు ఎంపికైంది. రేవతికి జాతీయ జూడో పోటీల్లో పాల్గొనేందుకు ఆర్థిక సమస్యలు అడ్డురాగా వెంకట్ ఫౌండేషన్ నిర్వాహకులు గంప వెంకట్ అదనపు కలెక్టర్ చేతుల మీదుగా రేవతికి ఆర్థిక సహాయాన్ని అందించారు.

## మిల్లెట్స్ భోజనం వితరణ

కరీంనగర్ అర్బన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ కూరగాయల మార్కెట్‌లోని వెంకటేశ్వర ఆలయంలో శనివారం తెలంగాణ శ్రీనివాసుల సేవా సంస్థ ఆధ్వర్యంలో మిల్లెట్స్ భోజనం వితరణ చేశారు. పోలీస్ శిక్షణ కళాశాల(పీటీసీ) ప్రిన్సిపాల్ శ్రీనివాస్ మిల్లెట్ భోజనాలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో 200మంది శ్రీనివాస మిత్రులు పాల్గొన్నారని తెలంగాణ శ్రీనివాసుల సేవా సంస్థ వ్యవస్థాపక చైర్మన్ వూట్కూరి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.

## 'అల్ఫోర్స్'లో ఘనంగా శతచండీ యాగం

భగత్‌నగర్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఈ-టెక్నో పాఠశాలలో శనివారం శ్రీ శతచండీయాగం ఘనంగా ప్రారంభమైంది. అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి నరేందర్‌రెడ్డి దంపతులు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. సాయంత్రం శ్రీదేవిభూదేవి సమేత శ్రీ వెంకటేశ్వరస్వామి కళ్యాణ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు.

## ఉత్సాహంగా 'పేరెంట్స్ ఖేల్'

భగత్‌నగర్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఈ-టెక్నో పాఠశాలలో శనివారం పేరెంట్స్ ఖేల్ విద్యార్థుల తల్లిదండ్రుల్లో ఉత్సాహాన్ని నింపింది. ఈసందర్భంగా అల్ఫోర్స్ నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల తల్లిదండ్రులతో సంబంధాలు పెంపొందించుకోవటమే ప్రధాన లక్ష్యంగా వినోదాత్మకంగా పేరెంట్స్ ఖేల్ నిర్వహించామన్నారు. కార్యక్రమంలో 200 మంది తల్లిదండ్రులు, వారి పిల్లలతో కలిసి పాల్గొన్నారు.

## బాలల సంరక్షణ అందరి బాధ్యత

కరీంనగర్ టౌన్/సుభాష్‌నగర్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): బాలల పరిరక్షణ మనందరి బాధ్యత అని కార్పొరేటర్ కంసాల శ్రీనివాస్ అన్నారు. శనివారం కిసాన్‌నగర్ అంగన్‌వాడీ సెంటర్‌లో బాల్ వివాహ ముక్త్ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో చైల్డ్ హెల్ప్ లైన్ ఉద్యోగి మహేశ్, సూపర్‌వైజర్ కళావతి, టీచర్లు సుజాత, పద్మజ, ఆయాలు పాల్గొన్నారు.

## కోరా జాన్సన్ పాఠశాలలో రెడ్ డే

గణేష్‌నగర్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): నగరంలోని కోరా జాన్సన్ పాఠశాలలో శనివారం రెడ్ డే వేడుకలు నిర్వహించారు. కార్యక్ర మంలో చైర్మన్ మహిపాల్‌రెడ్డి, డైరెక్టర్లు వరప్రసాద్, రాంరెడ్డి, సింహాచలం హరిక్రిష్ణ, వంగల సంతోష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# బాలల గ్రంథాలయాలు ఏర్పాటు చేయాలి



గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లేశ్‌కు వినతిపత్రం ఇస్తున్న కిరణ్

కరీంనగర్ కల్చరల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): నగర పాలక సంస్థ పరిధిలో బాలల గ్రంథాలయాలు ఏర్పాటు చేయాలని సామాజిక కార్యకర్త, జాతీయ యువజన అవార్డు గ్రహీత కిరణ్‌కుమార్ శనివారం జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు సత్తు మల్లేశ్‌కు వినతిపత్రం సమర్పించారు. జిల్లా కేంద్ర గ్రంథాలయంలోనే బాలల గ్రంథాలయం కొనసాగు తోందన్నారు. నగరం అభివృద్ధి చెందిన దృష్ట్యా బాలల కోసం పలు ప్రాంతాల్లో గ్రంథాలయాలు అవసరమన్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు సత్తు మల్లేశ్ మాట్లాడుతూ బాలల గ్రంథాలయాల కోసం కృషి చేస్తానన్నారు. ప్రభుత్వంతో మాట్లాడి గ్రంథాలయాల ఏర్పాటు కోసం సమష్టిగా ముందుకు పోదామని అన్నారు. ఈ కార్యక్రమంలో బోనాల అశోక్ తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు సత్తు మల్లేశ్‌ను జ్ఞాపికతో సత్కరించారు.

## అభివృద్ధిపై దృష్టి సారించాలి

హుజూరాబాద్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ నియోజకవర్గ అభివృద్ధిపై ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి దృష్టి సాగించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి అన్నారు. హుజూరాబాద్‌లో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సమావేశంలో కొప్పుల శంకర్, కొంకట చంద్రయ్య, రాసపల్లి శంకర్, సారయ్య, రాజు, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

## పన్నుల వసూళ్లు వేగవంతం చేయాలి

జమ్మికుంట, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట మున్సిపల్ పరిధిలో పన్నుల వసూళ్లు వేగవంతం చేయాలని మున్సిపల్ కమిషనర్ ఎండి ఆయాజ్ అన్నారు. శనివారం మున్సిపల్ కార్యాలయంలో వార్డు ఆఫీసర్లు, బిల్ కలెక్టర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు.

## ప్రమాణ స్వీకారంపై హైకోర్టు స్టే

జమ్మికుంట రూరల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రమాణ స్వీకార ప్రక్రియను తాత్కాలికంగా నిలిపివేయాలని హైకోర్టు తీర్పు వెలువరించింది. మార్కెట్ కమిటీ చైర్మన్‌గా పుల్లూరి స్వప్న నియామకం చెల్లదని, ఆమె స్కూల్ రికార్డుల్లో బీసీ వడ్రంగి ఉందని నాగం కిష్టయ్య అనే వ్యక్తి హైకోర్టును ఆశ్రయించాడు. విచారణ చేపట్టి నివేదిక అందజేయాలని హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది.

## పాఠశాల భవనాన్ని వెంటనే ఖాళీ చేయాలి

హుజూరాబాద్ రూరల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని విశ్వప్రగతి పాఠశాల భవనాన్ని హైకోర్టు ఉత్తర్వులు, జిల్లా విద్యాశాఖ అధికారి ఆదేశాల మేరకు ఖాళీ చేయాలని మండల విద్యాధికారి భూపతి శ్రీనివాస్ అన్నారు. శనివారం హుజూరాబాద్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు.

## చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

హుజూరాబాద్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని హుజూరాబాద్ మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్, జడ్జీ పీబీ కిరణ్‌కుమార్ అన్నారు. పట్టణంలోని మాంటిస్సోరి ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో శనివారం విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు.

## ఉత్తమ ఫలితాలు సాధించాలి

గంగాధర, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని డీఐఈవో జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం తల్లిదండ్రులు, అధ్యాపకులతో సమావేశం నిర్వహించారు.

## ప్రభుత్వాన్ని బదనాం చేస్తే ఊరుకోం



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న వొడితెల ప్రణవ్

హుజూరాబాద్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బదనాం చేయాలని చూస్తే ఊరుకోబోమని హుజూరాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ వొడితెల ప్రణవ్ అన్నారు. హుజూరాబాద్ పరిధిలోని బోర్నపల్లిలో నిర్వహిస్తున్న వీణవంక, సైదాపూర్ మండలాల ఎంజేపీబీటీ బాలుర పాఠశాలలను ఆయన శనివారం తనిఖీ చేశారు. అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

# షాద్‌నగర్ ఎమ్మెల్యే వ్యాఖ్యలపై నిరసన

**- క్షమాపణ చెప్పాలని వెలమ సంఘం నాయకుల డిమాండ్**

**- అధికారులకు ఫిర్యాదు**

హుజూరాబాద్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద షాద్‌నగర్ ఎమ్మెల్యే శంకర్ వెలమలను దూషించడాన్ని నిరసిస్తూ శనివారం డివిజన్ వెలమ సంఘం నాయకులు నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. పలువురు మాట్లాడుతూ వెలమ కులాన్ని దూషించిన షాద్‌నగర్ ఎమ్మెల్యే శంకర్ తక్షణమే క్షమాపణ చెప్పి, తన పదవికి రాజీనామా చేయాలన్నారు. అనంతరం ఎమ్మెల్యే శంకర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. హుజూరాబాద్ పోలీస్ స్టేషన్లో, తహసీల్దార్ కార్యాలయాల్లో చర్యలు తీసుకోవా లని కోరుతూ ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో వెలమ సంఘం నాయకులు బొంత గోమతి, పంబిడి జగన్మోహన్‌రావు, పుల్లూరి ప్రభాకర్‌రావు, సాగిరామ్ భద్రరావు, కల్లెపు మోహన్‌రావు, వర్ధినేని రవీందర్ రావు, బోయినపల్లి వెంకటేశ్వరరావు, రాఘవరావు, మలహల్ రావు, రాజేశ్వరరావు, శ్రావణ్‌రావు, సుధాకర్‌రావు, శ్రీనివాస్ రావు, ముత్యంరావు, బాపురావు, వీరభద్రరావు, మాదవ రావు, వెంకట్రావ్, దేవేందర్‌రావు, రాఘవరావు పాల్గొన్నారు

● వెలమ సామాజిక వర్గాన్ని కించపరుస్తూ షాద్‌నగర్ ఎమ్మెల్యే శంకర్ చేసిన వ్యాఖ్యలపై కఠిన చర్యలు తీసుకోవాలని రైతు, ప్రజా సంఘాల సమాఖ్య జాతీయ అధ్యక్షుడు పోలాడి రామారావు అన్నా రు. శనివారం హుజూరాబాద్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు.

**సుభాష్‌నగర్**: కులాన్ని కించపరిచే విధంగా వ్యాఖ్యలు చేసిన షాద్‌నగర్ ఎమ్మెల్యే శంకర్‌పై చర్యలు తీసుకోవాలని పద్మనాయక వెలమ సంఘం అధ్యక్షుడు జువ్వాడి వేణుగోపాల్‌రావు, ప్రధాన కార్యదర్శి చీటి ప్రకాశ్‌రావు డిమాండ్ చేశారు. శనివారం నగరంలోని ప్రెస్ భవన్‌లో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే మాటల వెనక ఎవరో ఉన్నారని, దీనికి కాంగ్రెస్ ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యేపై కరీంనగర్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని తెలిపారు. సమావేశంలో ఉపాధ్యక్షుడు గంద్ర సంపత్‌రావు, సంయుక్త కార్యదర్శి బోయినపల్లి భూపతి రావు, కోశాధికారి నిమ్మనేని భీమ్‌రావు, చిట్నేని మోహన్ రావు, సుంకిశాల సంపత్‌రావు, చిట్నేని రఘురాం రావు, జోగినిపల్లి రాజగోపాల్‌రావు, అయిల్నేని సుధాకర్‌రావు, తాండ్ర అశోక్‌రావు, బోయినిపల్లి గీత పాల్గొన్నారు.

● వెలమ సామాజిక వర్గాన్ని కించపరిచేలా వ్యాఖ్యలు చేసిన షాద్‌నగర్ కాంగ్రెస్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌పై చర్యలు తీసుకోవాలని రైతు, ప్రజా సంఘాల సమాఖ్య జాతీయ అధ్యక్షుడు పోలాడి రామారావు కోరారు. నగరంలోని ప్రెస్‌భవన్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే శంకర్ చేసిన వ్యాఖ్యలతో ఓసీల మనోభావాలు దెబ్బతిన్నాయన్నారు.



హుజూరాబాద్‌లో నల్లబ్యాడ్జీలతో నిరసన తెలియజేస్తున్న వెలమ సంఘం నాయకులు

## సభ్యత్వాన్ని రద్దు చేయాలి

జమ్మికుంట రూరల్, డిసెంబరు7 (ఆంధ్రజ్యోతి): వెలమ జాతిని కించ పరిచే విధంగా మాట్లాడిన షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ శాసనసభ సభ్యత్వాన్ని రద్దు చేయాలని మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపల్లి రాజేశ్వర్ రావు అన్నారు. శనివారం జమ్మికుంట పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో చైర్మన్ మాట్లాడారు.. కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పో ల్నేని సత్యనారాయణ, పుల్లూరి సంపత్‌రావు, రామిడి రవిందర్‌రావు, పోల్సాని మనోహర్‌రావు, సంపత్‌రావు, ప్రభాకర్‌రావు, పోల్సాని కళాధర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## రేపు జాబ్‌మేళా

హుజూరాబాద్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీవాగ్దేవి డిగ్రీ కళాశాలలో సోమవారం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల కరస్పాండెంట్ ఏనుగు మహిపాల్ రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన యువత వివరాలకు 9701011801, 9885069146, 9502372382 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

# కాంగ్రెస్ నాయకుల బైక్ ర్యాలీ



సైదాపూర్‌లో బైక్ ర్యాలీ చేపడుతున్న కాంగ్రెస్ నాయకులు

సైదాపూర్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తి కావడంతో మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ దొంత సుధాకర్ మాట్లాడారు. పొన్నం ప్రభాకర్ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తరువాత ఏడాది కాలంలో మండలంలో వివిధ అభివృద్ధి పనులకు రూ. 38కోట్ల 18లక్షల 43వేల నిధులు మంజూరయ్యాయని తెలిపారు. కార్యక్రమంలో సింగిల్ విండో అధ్యక్షుడు కొత్త తిరుపతిరెడ్డి కాంగ్రెస్ సీనియర్ నాయకులు గుండారపు శ్రీనివాస్, చాడ కొండాల్‌రెడ్డి, పోగు రమేష్, మ్యాకల రవీందర్, లంకదాసరి మల్లయ్య, తప్తగిరి, మాల్లారెడ్డి, వివిధ గ్రామాల కార్యకర్తలు పాల్గొన్నారు.

**చిగురుమామిడి**: మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు ర్యాలీ నిర్వహించారు. మండల కేంద్రంలోని శివాలయంలో హుస్నాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి చిట్టుమల్ల రవీందర్, పోటు మల్లారెడ్డి, ఐరెడ్డి సత్యనా రాయణరెడ్డి, ఎలగందుల లక్ష్మణ్, ఎండి షాబోద్దీన్, అందె పర్శారాములు, వంగ కనుకయ్య, పూలలచ్చిరెడ్డి, శ్రీమూర్తి రమేష్, సుద్దల ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

### ● సంక్షిప్తం..

● హుజూరాబాద్: పట్టణంలోని హైస్కూల్ మైదానంలో అర్బన్ స్థాయి కబడ్డీ అథ్లెటిక్స్ ఎంపిక పోటీలను ఆర్డీవో రమేశ్ బాబు, తహసీల్దార్ కనకయ్య, ఎంపీడీవో సునీత, ఎంఈవో శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య శనివారం ప్రారంభించారు.

- మధ్యప్రదేశ్‌లోని మడాసూర్‌లో ఈ నెల 9నుంచి 14 వరకు నిర్వహించనున్న జాతీ య స్థాయి అండర్-14 బాలికల హాకీ టోర్నమెంట్‌కు తెలంగాణ జట్టు కోచ్‌గా శంకరపట్నం మండలం మెట్‌పల్లి ప్రభుత్వ పాఠశాలలో పీఈటీగా పనిచేస్తున్న యేముల రవికుమార్ ఎంపికయ్యారు.

● సైదాపూర్: ఎక్లాస్‌పూర్ గ్రామంలో అయ్యప్ప స్వామి ఆరట్టు ఉత్సవాలను అయ్యప్ప భక్తులు వైభవంగా నిర్వహించారు.

● ఇల్లందకుంట:: యువజన కాంగ్రెస్ జిల్లా కార్యదర్శిగా మండల కేంద్రా నికి చెందిన మహేష్ ఇటీవల ఎన్నికవడంతో నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ ప్రణయ్ ఆయన నివాసంలో సన్మానించారు.

● గన్నేరువరం: సీపీఐ ఆవిర్భవించి వంద సంవత్సరాలు అవుతున్న సందర్భంగా ఈ నెల 26న శతజయంతి ఉత్సవాలను గ్రామగ్రామాన ఘనంగా నిర్వహించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో నిర్వహించిన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు.

● జమ్మికుంట: పిట్టలవాడలో గల అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులకు సుఖ ప్రసవాలపై హెల్త్ ఎడ్యూకేటర్ మోహన్‌రెడ్డి అవగాహన కల్పించారు.

● శంకరపట్నం: మండలంలోని లింగాపూర్, మెట్‌పల్లి, తాడికల్, కేశవపట్నం గ్రామాల్లో ఇటీవల మృతి చెందిన వారి కుటుంబాలను ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ శనివారం పరామర్శించారు.

● గంగాధర: యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన గట్టుబూత్కూర్‌కు చెందిన మహేష్‌ను ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, నాయకులు సన్మానించారు.

- మాలల ఒత్తిడికి తలొగ్గి సీఎం రేవంత్‌రెడ్డి వర్గీకరణ అమలును జాప్యం చేయడం సరికాదని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్య క్షుడు బెజ్జంకి అనిల్ మాదిగ అన్నారు. గంగాధరలో సమీక్షా సమావేశం నిర్వహించారు.

● శంకరపట్నం: మతిస్థిమితం లేని ములుగు జిల్లా రామప్ప మండలం పాలంపేట గ్రామానికి చెందిన వ్యక్తి రెండు రోజులుగా తిరుగుతుండగా ఎస్సై కొత్తపల్లి రవి పట్టుకుని కుటుంబీకులకు అప్పగించారు.